# గీతోపనిషత్


(శ్రీమద్భగవద్గీత 15వ అధ్యాయము-పురుషోత్తమ ప్రాప్తి యోగము)

మాస్టర్ పార్వతీకుమార్

ధనిష్ఠ


# ధనిష్ఠ ప్రచురణలు
















ప్రతులకు : ధనిష్ఠా ఫౌండేషన్, 15-7-1, ఏంజిల్స్ ఎన్‌క్లేవ్, కృష్ణనగర్, విశాఖపట్నం - 530 002.

Phone : 0891-2701531 www.dhanishta.org info@dhanishta.org

ఈ ప్రచురణ యొక్క కంటెంట్ సద్భావన చర్యగా మరియు వ్యక్తిగత ఉపయోగం కోసం మాత్రమే ఉచితంగా ఇవ్వబడుతుంది. దానిని అలానే ఉంచడం మన బాధ్యత.
విధంగానైనా లేదా ఏ ప్లాట్‌ఫారమ్‌లోనైనా వాణిజ్యీకరణ నిషేధించబడింది, అలాగే ప్రచురణకర్త యొక్క వ్రాతపూర్వక అనుమతి లేకుండా పంపిణీ, లేదా పూర్తిగా, లేదా కొంత భాగాన్ని ప్రచురించడం నిషేధించబడింది. అన్ని హక్కులూ గ్రంథకర్తవి, ప్రచురణకర్తవి.

# గీతోపనిషత్

(శ్రీమద్భగవద్గీత 15వ అధ్యాయము - పురుషోత్తమ ప్రాప్తి యోగము)

మాస్టర్ పార్వతీకుమార్

ధనిష్ఠ

ప్రథమ ముద్రణ : 2021 (60వ గురుపూజా మహోత్సవములు)

ప్రతులు : 1,000

© ధనిష్ఠ ఫౌండేషన్, విశాఖపట్నం, ఆంధ్రప్రదేశ్, ఇండియా.

వెల : రూ॥ **50-00**

ప్రతులకు :

**ధనిష్ఠ ఫౌండేషన్,**

15-7-1, ఏంజిల్స్ ఎన్‌క్లేవ్,

కృష్ణనగర్, విశాఖపట్నం - 530 002.

ఫోన్ : 0891-2701531, 2509154.

website : www.dhanistha.org.
info@dhanistha.org.

ISBN : 978-81-89467-82-1

ముద్రణ :

**సత్యం ఆఫ్‌సెట్ ఇంప్రింట్స్**

మధురానగర్, విశాఖపట్నం.

ఫోన్ : 0891-2796538, 9849996538.

# ధనిష్ఠ

## స్వచ్ఛంద సేవా సంస్థ

**"ధనిష్ఠ"** అనగా ధనపూరిత దివ్యవాయువు. ధనమనగ దివ్య సంపద. అది కేవలము డబ్బుకాదు. డబ్బుతో సంపదను కొలువ లేము, కొనలేము. సంపద జీవన వైభవమునకు సంబంధించినది. మన శ్రుతులలో అగ్ని, వాయువు, ఇంద్రుడు, బృహస్పతి యిత్యాది దివ్య ప్రజ్ఞలను ధనమనిరి. ఆర్ష విజ్ఞానమే నిజమైన ధనము. అట్టి ధనమును కూర్పుచేసి వ్యాప్తి చేయుటకు "ధనిష్ఠ" 1992లో జన్మించినది.

**"ధనిష్ఠ"** మాస్టర్ పార్వతీకుమార్‌గారి వాక్కును సి.డి., ఆడియో, వీడియో క్యాసెట్ల రూపములోను, పుస్తకముల రూపము లోను భద్రపరచి సత్సాధకుల కందించునట్టి యజ్ఞార్థకర్మను చేపట్టినది.

**"ధనిష్ఠ"** ఒక చక్కని గ్రంథాలయమును, ధ్యాన మందిరమును సద్గోష్ఠికై వలసిన వాతావరణమును - "జగద్గురు మందిరము"గ ఏర్పరచి, ఆసక్తి కలవారికి ధ్యానము, స్వాధ్యాయము నేర్పుచున్నది.

## సంకలనకర్త : మాస్టర్ పార్వతీకుమార్

**మా**తృదేశము మొదలుగా ఉత్తర అమెరికా, లాటిన్ అమెరికా మరియు ఐరోపా ఖండములలోగల ఆధ్యాత్మిక జిజ్ఞాసువులకు ప్రచోదనము కలిగించుచూ, భక్తి, జ్ఞానము, వైరాగ్యము, యోగాభ్యాసము యిత్యాది విషయములలో 34 సంవత్సరములుగా బోధనలు గావించుచూ, పరమ గురువుల మార్గానుయాయులకు వెలుగుదారి చూపించు చున్న సత్సాధనా సంపత్తిగల నవయుగ యోగ మార్గదర్శి **మాస్టర్ పార్వతీకుమార్**గారు. వారి బోధనలు లెక్కకుమించి యున్ననూ, పలురకములైన విషయ, విజ్ఞాన బోధనలుగా తెలియవచ్చును. అవి బోధనలుగానే కాకుండా నిత్యజీవితమున అనుసరణీయమై, ఆచరణ యోగ్యమై, ఆచరించువారికి సత్యదర్శనమున సత్వర ఫలితముల నందించు చున్నవని తెలుపుట అతిశయోక్తి కానేరదు.

సాంఘిక, ఆర్థిక, ఆధ్యాత్మిక, సాంస్కృతిక, కళారంగములలో వారి నిరంతర సేవలను గుర్తించి, గౌరవించి, ఆంధ్ర విశ్వకళా పరిషత్ 1997వ సంవత్సరములో **"డాక్టర్ ఆఫ్ లెటర్స్"** పట్టా నందించినది. 2013వ సంవత్సరములో గౌరవ ఆచార్యులుగా నియమింపబడిరి.

ఆర్థిక, సాంఘిక, సేవారంగములలో - మానవాళి మనుగడలో సుఖము, శాంతి పరిమళింపజేయు సూత్రముగా ఆధ్యాత్మికత అలరారినప్పుడే దానికి

సాఫల్యత, సార్థకత ఉండునని, *"మానవ సేవయే మాధవ సేవ"* అను మాటకు సరియైన అర్థము యిదేనని మాస్టరుగారు తమ ప్రవర్తన ద్వారా తెలియ పరచుచున్నారు. మాస్టర్ పార్వతీకుమార్‌గారు బాధ్యతగల గృహస్థులు, పేరున్న ఆర్థిక సలహాదారు, విజ్ఞానమును వికసింపజేయు గురువు, శారీరక – మానసిక రుగ్మతలను తొలగింపజేయు వైద్యులు, అష్టాంగ యోగము ననుష్ఠానము చేయుచు, వేలాదిమందితో అనుష్ఠింప చేయుచున్న యోగి. శతాధిక గ్రంథముల సంకలన కర్త, నిగర్వి, నిర్మల హృదయులు.

జ్ఞానము ఏ ఒక్కరికి చెందినది కాదనియు, జ్ఞానులు సైతము అందరునూ జ్ఞానమునకే చెందిన వారనియూ, జ్ఞానమే సరియగు వాహికల నెన్నుకొని తనను తాను ప్రకటించుకొనుచుండు ననియూ, అందుచే నిజముగా ఎవ్వరూ గ్రంథకర్తలు కాజాల రనియూ, సంకలన కర్తలే ననియు మాస్టరుగారి దృఢ విశ్వాసము. విశేష పరిజ్ఞానముగల ప్రతిభావంతు లైనప్పటికి సౌశీల్యముతో సామాన్యుల మిత్రత్వము నభిలషించు సమవర్తి.

మాస్టర్ పార్వతీకుమార్‌గారి ఆధ్వర్యమున ఎన్నియో ధార్మిక సంస్థలు దేశ విదేశములలో పరహితసేవ గావించుచున్నవి. "పరహితము పరమధర్మ" మను ఆర్యోక్తి వారి జీవితమును నడిపించుచున్నది. భగవద్ధ్యానము, స్వాధ్యాయము, పరహితములకు త్రిధాబద్ధులుగా ఎందరో ఆస్తికులకు వారు ప్రపంచమున ప్రచోదనము గావించుచున్నారు. పరమగురు పరంపర వారి కాదర్శము.

**- ధనిష్ఠ**

# ముందుమాట

సత్యాన్వేషకునకు పురుషోత్తమ ప్రాప్తి గమ్యమై యున్నది. దైవాంశయైన జీవుడు అష్ట ప్రకృతులచే ఆకర్షింపబడి తన నిజస్థితిని కోల్పోయి జనన మరణములను అనుభవించుచు క్షరునివలె వర్తించుచు నుండును. ప్రకృతి మాయకు లొంగి తనను తాను మరచును. ప్రకృతి నిర్వర్తించు మార్పులకు లొంగి ద్వంద్వములకు లోనై సుఖదుఃఖములను లాభనష్టములను, జయాప జయములను జనన మరణములను అనంతముగ అనుభవించు చున్నాడు. నిత్యము మార్పు చెందు ప్రకృతి యందలి మారక యున్న సత్యమును దర్శింప లేకున్నాడు. అసహజమగు స్వభావము నేర్పరచుకొని, సత్యమును గ్రహింపలేక, తన శాశ్వతత్వమును గూడ కోల్పోయినాడు. తన స్వభావమునకు తానువసుడై, తన స్వామిత్వమును తాను కోల్పోయినాడు.

ఇట్టి క్షర పురుషునకు తన మూల స్థానము పరిచయము చేసి, తాను దైవాంశయని తనకు జనన మరణములు లేవని ప్రకృతి అనుభూతి, వైభవము అందించు దివ్య సౌకర్యమని, తనకును ప్రకృతికిని కూడ మూలము దైవమేయని తెలియజేయుట ఈ అధ్యాయము యొక్క ప్రయోజనము.

మూల జ్ఞానము నొసగి జీవుని క్షరత్వము నుండి అక్షరత్వము నకు ఉద్ధరించి, పురుషోత్తమునితో అనుసంధానము గావించుట విధానము. క్షరపురుషుడు, అక్షర పురుషుడు, పురుషోత్తముడు అను సోపానములను పరిచయము చేసి, ఈ ముప్పురిని నరదేహమునందు దర్శనము చేయవచ్చునని తెలియపరచుట జరిగినది.

నరుని యందలి ఈశ్వర స్థానము, అక్షర పురుషస్థానము, క్షర పురుష స్థానము వివరింపబడినవి. ఈశ్వరుడే దిగివచ్చిన జీవుడని, జీవులు తమ మూలస్థానమును మరచినపుడు క్షరపురుషులగు చున్నారని తెలుపబడినది. సమస్తము నందలి దైవముతో అనుసంధా నము చెందుట అసంగ మార్గముగ తెలుపబడినది. దైవముతో కూడిన మానవుడు క్షరత్వ మధిగమించి, అక్షరుడై పురుషోత్తమ ప్రాప్తిని అనుభవించగలడు. ఇది ఈ అధ్యాయము యొక్క సారాంశము.

ఈ ముద్రణమును సమర్పించిన సోదరులు **శ్రీ భూపతిరాజు సత్యనారాయణరాజు** కుటుంబమునకు శ్రీకృష్ణ భగవానుని ఆశీస్సులు.

తేది 25-12-2020
మార్గశీర్ష శుద్ధ ఏకాదశి

**- మాస్టర్ పార్వతీకుమార్**

# విషయసూచిక


| | | | |
|---|---|---|---|
| 1 | వేదము నెరుగుట | ....... | 9 |
| 2 | సృష్టి వృక్షము | ....... | 11 |
| 3 | అసంగము | ....... | 13 |
| 4 | వైవిధ్యభావ స్థితి | ....... | 18 |
| 5 | నిత్య ఆధ్యాత్మిక జీవనము | ....... | 21 |
| 6 | బ్రహ్మపదము | ....... | 24 |
| 7 | నిత్యభావన | ....... | 27 |
| 8 | సాంగత్యము | ....... | 30 |
| 9 | విమూఢుడు | ....... | 33 |
| 10 | నిత్య సాధన | ....... | 37 |
| 11 | స్వయంప్రకాశకుడు | ....... | 39 |
| 12 | ఈశ్వరప్రాప్తి | ....... | 41 |
| 13 | వైశ్వానరుడు | ....... | 44 |
| 14 | హృదయ స్పందనము | ....... | 47 |
| 15 | కూటస్థుడు | ....... | 49 |
| 16 | విరాట్పురుషుడు | ....... | 52 |
| 17 | అపరిమితుడు | ....... | 55 |
| 18 | పురుషోత్తమప్రాప్తి | ....... | 58 |
| 19 | కృతకృత్యుడు | ....... | 60 |

1

## వేదము నెరుగుట

*శ్రీభగవా నువాచ :*

**ఊర్ధ్వమూల మధఃశాఖ మశ్వత్థం ప్రాహు రవ్యయమ్ ।**
**ఛందాంసి యస్య పర్ణాని యస్తం వేద స వేదవిత్ ॥ 1**

*తాత్పర్యము :* అవ్యయమగు అశ్వత్థ వృక్ష మొకటి కలదని, దాని మూలములు ఊర్ధ్వముగ నుండునని, శాఖలు క్రిందుగ కలిగి యుండునని, దాని ఆకులు వేదముల నుద్దేశించునని పెద్దలు చెప్పుదురు. ఈ వృక్షమును తెలిసినవారు యథార్థముగ వేదము తెలిసినవారు.

*వివరణము :* సూక్ష్మము నుండి స్థూలమునకు, అవ్యక్తము నుండి వ్యక్తమునకు సృష్టి ఏర్పడుచున్నది. సృష్టిమూలము ఊర్ధ్వమున నున్నది. దాని అవతరణము క్రమముగ నాలుగు స్థితులలో జరుగుచున్నదని, ఏడు స్థితులలో జరుగుచున్నదని, తొమ్మిది స్థితులలో జరుగుచున్నదని పెద్దలు బహు విధములుగ తెలిపిరి. బీజమందలి అంకురశక్తి వలన, బీజము మహా వృక్షమై

వెలియును. అంకురశక్తి గోచరము కాదు. అది సూక్ష్మతరము. అందుండి బీజము వృద్ధిచెందుట, మొలకెత్తుట, వృక్షమగుట, శాఖోపశాఖలుగ విస్తరించుట, రెమ్మలు ఆకులుగ విచ్చుకొనుట చూచుచున్నాము. ఈ మొత్తమునకు మూలమైన అంకురశక్తి కనపడుటలేదు. కాని దాని వలన క్రమముగ, సర్గములుగ సత్య లోకము ఆదిగా భూలోకము వరకు లోకము లేర్పడుచున్నవి. ఈ మూలము కార్యకారణ లోకములకు కూడ అతీతమై యున్నది. అది ఆధారముగ సమస్త సృష్టి జరుగుచున్నది. ఏర్పడుచున్న విషయములు గమనించుట సులభము కాని దాని ఆది తెలియ లేము. సమస్త సృష్టికి మూలమైన తత్త్వము ఊర్ధ్వముగ గోచరమున కతీతముగ యున్నది. దీనిని పెద్దలు తల్లక్రిందులుగ నున్న రావిచెట్టుతో పోల్చిరి. 'అశ్వత్థ' మనగ శాశ్వతత్వము ఆధారముగ నిలబడిన సృష్టియని అర్థము. ఈ వృక్షము చావు లేనిది. నాశము లేనిది. శాశ్వతముగ పుట్టుచున్నది. 'శ్వ' అనగా చావు. 'అశ్వ' అనగా చావనిది. శాశ్వతమైనది. 'అశ్వత్థ' అనగా శాశ్వతత్వమున నిలచినది. శాశ్వతమగు తత్త్వమాధారముగ జీవులు, సృష్టి వచ్చుచు పెరుగుచు, పోవుచు నుండు శాశ్వతకథ. అర్థము చేసుకొన్నచో, ఈ తల క్రిందులుగనుండు మహావృక్షము అవగాహన యగును. అట్టి అవగాహనమే వేదము నెరుగుట అని భగవానుడు ఉపదేశించు చున్నాడు.

## 2

# సృష్టి వృక్షము

అధశ్చోర్ధ్వం ప్రసృతా స్తస్య శాఖా
గుణప్రవృద్ధా విషయప్రవాలాః ।
అధశ్చ మూలా న్యనుసంతతాని
కర్మానుబన్ధీని మనుష్యలోకే ॥ 2

*తాత్పర్యము :* ఈ సృష్టి వృక్షము యొక్క శాఖలు గుణములచే వృద్ధి పొందుచు నుండును. ఇంద్రియములచే చిగుళ్ళు ధరించును. కర్మలచే భూమిపై పాదుకొనును. అవి మరల చిగుళ్ళు వేయును. మనుష్యలోకమున భావములచే కర్మలును, కర్మలనుండి మరల భావములు, ఒకదాని నొకటి విస్తరింప జేయుచు దృఢముగ పాదుకొని యుండును.

*వివరణము :* సృష్టి వృక్షమునకు మూడు గుణములు, ఐదు ఇంద్రియములు ప్రధానముగ వర్తించుచుండును. గుణ సమ్మేళనము వలన వైవిధ్యమగు భావములు కలుగుచు నుండును. భావములు ఇంద్రియములకు ప్రేరణ నిచ్చును. ఇంద్రియములు కర్మ నిర్వర్తించును. కర్మలనుండి వాసనలు పుట్టును. తదనుగుణ

మగు భావములు మరల కలుగును. భావములనుండి కర్మలు, కర్మముల నుండి భావములు నిరంతర మేర్పడుచుండగ కర్మ తంత్రమున జీవుడు బంధింపబడి, నిరంతరము చక్రభ్రమణము చేయును.

అది ఎట్లనగా, కొమ్మలనుండి ఊడలు ఏర్పడి, ఊడలు భూమియందు పాతుకొని, మరల వృక్ష మేర్పడుచు, మరల వృక్షము నుండి కొమ్మలు, కొమ్మలనుండి ఊడలు- ఇట్లనంతముగ (మఱ్ఱి చెట్టువలె) తుది, మొదలు తెలియని స్థితి ఏర్పడును.

పై విధముగ కర్మ వాసనలను బట్టి భావములు, భావములను బట్టి మరల కర్మలు ఒకదాని నొకటి వృద్ధి గావించుచు, జనన మరణ చక్రమున నిరంతరము జీవులు వర్తించుచునుందురు. దీని కంతు లేదు. మొదలు, తుది లేవు. జీవుల కొరకు సృష్టి, సృష్టియందు జీవులు ఆద్యంతములు లేక పరిభ్రమించుచునుందురు. ఇదియొక అనంత వ్యాపారము. మొదలు, తుది లేని ఒక అద్భుతము, ఆశ్చర్యకరము అగు ప్రక్రియ. ఇందు జీవులు నిరంతరము ఆరోహణ అవరోహణ క్రమములలో తిరుగాడుచునేయుందురు. ఇది హరిమాయ అని పెద్దలు తెలుపుదురు.

## 3

## అసంగము

న రూపమస్యేహ తథోపలభ్యతే
నాంతో న చాదిర్న చ సంప్రతిష్ఠా ।
అశ్వత్థమేనం సువిరూఢమూల
మసంగశస్త్రేణ దృఢేన ఛిత్త్వా ॥ 3

*తాత్పర్యము* : ఈ సృష్టివృక్షము యొక్క స్వరూపము అవగాహనకు అందనిదై యున్నది. దీని మొదలు కానలేరు. దీని అంతము కానలేరు. కేవలము అసంగమనెడి అస్త్రముతోనే దీని రహస్యము ఛేదింపవలెను. దానికి దృఢచిత్తము ఆవశ్యకమై యున్నది.

*వివరణము* : వృత్తాకారముగ ఆద్యంతములు లేక ఏర్పడి యున్న సృష్టియందు ఇది మొదలు, ఇది తుది అని తెలియచెప్పుట అసాధ్యము. వృత్తమున మొదలు, తుది కానలేము కదా! తుది యందు మొదలున్నది. మొదలు యందు తుది యున్నది. బీజము నుండి వృక్షము, వృక్షము నుండి బీజము నిరంతర మేర్పడుచునే యున్నవి.

1. వృక్షమునకు బీజము ఆదికాగ, బీజమునకు వృక్షము ఆది. వృక్షములేని బీజము లేదు. బీజములేని వృక్షము లేదు. ఇట్లొక దానియందొకటి అంతర్హితముగ యున్నది.

2. గ్రుడ్డు నుండి పక్షి, పక్షి నుండి గ్రుడ్డు నిరంతరము వచ్చుచునే యుండును.

3. తల్లి - పిల్ల, తండ్రి - కొడుకు నిరంతరము ఏర్పడుచునే యున్నారు.

4. ఆలోచన వలన పని, పనివలన ఆలోచన నిరంతరము సాగుచునే యున్నవి.

5. మరణము పుట్టుకకు కారణ మగుచున్నది. పుట్టుక మరణమునకు కారణ మగుచున్నది. అట్లే ఉదయము సాయంత్రమునకు, సాయంత్రము ఉదయమునకు, అమావాస్య పూర్ణిమకు, పూర్ణిమ అమావాస్యకు కారణ మగుచున్నవి.

పై తెలిపిన విధముగ సృష్టి యందంతయు ఆద్యంతములు లేక యున్నది. ఉన్నదెప్పుడూ యున్నది. 'ఉన్నది పోదు, లేనిది రాదు' అని భగవానుడు రెండవ అధ్యాయముననే తెలిపినాడు. కనబడినపుడు యున్న దనిపించును. అదృశ్యముగ నున్నపుడు లేదనిపించును. అసలు లేనిదే ఎట్లు కనబడగలదు! పగలు చుక్కలు లేవని అనగలమా? ఉన్నవి, కాని అవి కనబడవు. ఈ కనబడుట, కనబడకుండుట చూచువాని బట్టియేగాని,

ఉన్నదెప్పుడూ యున్నది. అదియే స్థితి మార్పులు చెందుచు నుండును.

ఆకాశజలము భూమిపై జలమగుట, జలము మంచుగడ్డ యగుట, ఇట్లు నారములే (నీరే) రకరకముల స్థితులు పొందుచు అవరోహణ క్రమమున ఘనీభవించి, ఆరోహణ క్రమమున నిజస్థితి చేరును. అన్ని స్థితుల యందు మూలము నీరే. ఈ నీటినే నారములని, జీవములని అందురు. వాని దక్షిణాయన, ఉత్తరాయణ క్రమమును నారాయణ మందురు. నారాయణము శాశ్వతము. అందలి జలము శాశ్వతమే. అవరోహణ క్రమమున, ఆరోహణ క్రమమున ఉన్నవి నారములే. ఇట్టి శాశ్వతమైన జలము లకు స్థితి భేద ప్రభావ మున్నది. ఇట్లు మారుచున్న దానిలో, మారకయున్న దానిని చూడవలెను.

మట్టిరూపముల యందు మట్టి శాశ్వతము. బంగారు నగలయందు బంగారము శాశ్వతము. కుండయందు మట్టి, మట్టిగనే యుండును గాని, కుండ ప్రభావము మట్టిపై పడదు. మూల మెప్పుడును మూలముగనే యుండును. దాని యందేర్పడు మార్పులు మూలము నంటవు. మార్పులు ప్రకృతి నిర్వహించు మాయ. అట్టి మార్పును చూడక, మార్పులకు మూలమైయున్న దానిని చూచుటకు ప్రయత్నించవలెను. ఇట్లు మూలమగు తత్త్వమును దర్శించుట వలన చిత్తము స్థిరమగును.

స్థిరచిత్త మున్నచోట మార్పులను ఒక నాటకముగ గుర్తించుటకు వీలగును. మార్పులకు లోనుకాకుండుట కూడ సిద్ధించును.

ఆకాశమునుండి పుట్టిన నాలుగు భూతములలో మార్పులు నిరంతరము జరుగుచున్నవి. కాని ఆకాశము, ఆకాశముగనే స్థిరమై యున్నది. అందు జరుగు మార్పులకు అది లోను కాదు.

స్థిరమగు సముద్రమున అనేకానేకములగు అల లేర్పడును. అల యందును, సముద్రము నందును, సముద్రము సముద్రము గనే యున్నది.

మార్పులతో కూడుట సంగమము. మార్పులేని తత్త్వముతో కూడుట అసంగము. అసంగమనగా 'అ'తో సంగమము. 'అ' అనునది భగవంతుని నామము. అట్టి శాశ్వతమగు భగవతత్త్వముతో కూడిన వానికి సృష్టివృక్షము సమగ్రముగ అవగాహన యగును. కారణములు వెదకుకొను వానికి చక్రభ్రమణమే యుండును గాని, తుది మొదలు తెలియవు.

మార్పు లన్నియు వచ్చి పోవునవే. వానితో సంగము చేసినచో అవగాహన లభింపదు. మార్పు లేని దానితో కూడియున్నచో అవగాహన లభించును. మార్పులతో సంగమించుట సంగమము. మార్పులేని దానితో సంగమించుట అసంగము. భార్యతో సంగ మించువాడు, భార్యా వియోగమున దుఃఖించును. తాను వివాహ

మాడుటకు పూర్వము ఆమె భార్య కాదు. ఆమె యందును, తనయందును యున్నది 'నేను' అను ప్రజ్ఞయే. తాను భర్తగను, ఆమె భార్యగను, తాను పురుషుడుగను, ఆమె స్త్రీగను పాత్రధారణము చేసినది 'నేను' అను ప్రజ్ఞయే. మూలమున జీవులందరు 'నేను' అను ప్రజ్ఞయే. దాని చుట్టును ఏర్పడునవి బాంధవ్యములు, బంధములు. అవి మారుచు నుండును. వానితో కూడినపుడు, అవి మార్పు చెందినపుడెల్ల దుఃఖము కలుగును. 'నేను' అను ప్రజ్ఞ మారనిది. దానితో స్థిరముగ కూడినచో, మార్పులు అమితముగ బాధించవు. కనుక 'అ' అను శాశ్వత ప్రజ్ఞతో కూడి యున్న వానికి శాశ్వత సుఖమున్నది. సమస్తమగు మార్పు కాలాను గుణముగ ప్రకృతి నిర్వర్తించు చున్నదని తెలిసి సమాధానము పొందును. సమాధాన స్థితియే సమాధి.

నదీ ప్రవాహమున కొట్టుకొనిపోవు వానికి ప్రవాహము యొక్క స్వరూప స్వభావములు తెలియవు. ఒడ్డున కూర్చున్న వానికి నదీ ప్రవాహము అనుభూతి నిచ్చును. స్థిరమగు ప్రజ్ఞ గలవాడు అన్నియును గ్రహింపగలడు. అస్థిరమగు విషయములకై దుఃఖ పడడు.

ఈ 'అసంగము' అను రహస్యము తెలిసినవాడు తెలిసిన వాడు. అన్నిటియందు మూలమును దర్శించుచు ఆవాహన, విసర్జన లేని స్థితి యందుండును. దీనిని శ్రద్ధతో సాధించుకొను వాడు సిద్ధుడగును.

4

## వైవిధ్యభావ స్థితి

తతః పదం తత్పరిమార్గితవ్యం
యస్మిన్ గతా న నివర్తంతి భూయః ।
తమేవ చాద్యం పురుషం ప్రపద్యే
యతః ప్రవృత్తిః ప్రసృతా పురాణీ ॥ **4**

*తాత్పర్యము :* పిమ్మట ఏ స్థానమందు ప్రవేశించినవారు తిరిగి వెనుకకు రారో, ఎవరి నుండి అనాదియైన ప్రవృత్తి వ్యాపించునో అట్టి ఆది పురుషుని నేను శరణు పొందుచున్నాను. ఆ పథము మాత్రమే అన్వేషింపదగినది.

*వివరణము :* ఈ నాలుగవ శ్లోకము పిమ్మట "తతః" అను పదముతో ప్రారంభింపబడెను. ఇచ్చట పిమ్మట యనగా ముందు శ్లోకమున చెప్పబడిన దృఢచిత్తము ఏర్పరచుకొనుట అని తెలియ వలెను. సకల మార్పులకు మూలము, స్వతః మార్పు చెందనిది యగు పరమాత్మ తత్త్వమును అన్నిట, అంతట చూచుట ఒక దీక్షగ స్వీకరించవలెను. సమస్త సృష్టియందు మార్పు చెందని తత్త్వమును, మార్పు చెందు ప్రకృతి ఆవరించి యుండును. పురుషుని నుండి వ్యక్తమైన ప్రకృతి, పురుషుని ఆధారముగ గొని

అనేకానేకములగు మార్పులు గావించుచు, వ్యాప్తి చెంది యుండును. ప్రకృతి అల్లిక విస్తృతమై యుండుటచే, మొదలు చివర తెలియక అల్లిబిల్లియై యుండును. అగోచరమై యుండును. మార్పులు ఎన్ని జరిగినను ఆ మార్పులకు బలము నిచ్చునవి పరతత్త్వమే లేక ఆదిపురుషుడే. ఆదిపురుషు డాధారముగా ఆదిశక్తి సర్వమును నిర్మించును. మార్పులన్నిటికిని ఆమెయే ఆధారము. ఆమె కాధారము ఆదిపురుషుడు. అతడు కదలడు, మెదలడు. అంతట యుండి నిశ్చలుడై, నిర్వికారుడై యుండును. అతనిని చేరు మార్గము అన్వేషింపదగినది. అది అందరికిని శాశ్వత నివాసము. ప్రకృతికి కూడ అదియే నివాసము. దానినే "శ్రీ" నివాసమని అందురు.

అచట నుండియే ప్రకృతి మరల మరల విస్తరించి వ్యాపించుచు నుండును. మరల అతనిలోనికే తిరోధానము చెందును. జీవులు కూడ అచ్చట నుండియే ప్రకృతి అల్లిన సృష్టి లోనికి దిగివచ్చి మార్పులకు లోనగుచు నుండును. ఈ మార్పు లనంతము. అందు వలననే అనంతకాలము మార్పులయందు చిక్కుకొని, అలసట చెంది, మార్పులు లేని స్థితిని చేరి, స్థిమితముగ నుండవలెనని జీవు లారాటపడును. స్థిరమున్నచో సుఖ ముండును. సుఖములకై ప్రాకులాడువానికి స్థిరముండదు. సుఖప్రాప్తికై యత్నింపక, స్థిరప్రాప్తికై యత్నించవలెను. స్థిరమున్నచో సుఖము కూడ యుండును. స్థిరమున్న వానికి సుఖము అరచేతి యందు ఫలము

వలె యుండును. శివుడు స్థిరుడు. కనుక ఎచ్చట నున్నను సుఖము గనే యుండును. స్మశానమైనను, దేవాలయమైనను అతనికి సమాన సుఖమే. ఈ స్థిరత్వమునే నారాయణ మనియు, జలములకు పుట్టుకస్థాన మనియు కూడ తెలుపుదురు. అదియే పర బ్రహ్మమని కూడ యందురు.

ప్రకృతి - కాలము అందుండియే పుట్టుచున్నవి. సంకల్పమునకు మూలము కూడ అదియే. ఇట్టి మూలస్థానము చేరినవారు మరల ఆవృత్తులలో పడరు. వైకుంఠపాళియందు పాములు, నిచ్చెనలు దాటినవారివలె పరమ పదమున యుందురు. అచ్చటకు చేరుటకు అన్నిటియందు దానినే గమనించుట, చింతించుట, స్మరించుట, ఉపాసించుట, కూడియుండుట చేయవలెను. అంతేగాక దానినే శరణు గూడ పొందవలెను. ఈ స్థిరము, మూలము అగు తత్త్వమును చేరుటకు దానినే శరణుకోరి, దాని నుపాసించు ప్రయత్నమును దృఢముగ చిత్తమందు ధరించి యుండవలెను. దాని శరణు పొందుటయే పరమావధిగ, ఇతరము లన్నియు దానిని మార్పులే అని భావించుచు సాగవలెను. "త్వమేవచ ఆద్యం పురుషం ప్రపద్యే" అనునవి పురుషోత్తమ ప్రాప్తికై ఈయబడిన మంత్రము. మరియు "అసంగ శస్త్రేణ దృఢేన చిత్వా" అనునవి దీక్షగా స్వీకరింపవలెను. ఈ రెండింటి ఉపాయముతో పురుషోత్తమ ప్రాప్తి లభించునని అధ్యాయ ప్రారంభముననే భగవానుడు పలికినాడు.

## 5

# నిత్య ఆధ్యాత్మిక జీవనము

నిర్మానమోహా జితసంగదోషా
అధ్యాత్మనిత్యా వినివృత్త కామాః ।
ద్వంద్వైర్విముక్తాః సుఖదుఃఖసంజ్ఞై
ర్గచ్ఛంత్య మూఢాః పదమవ్యయం తత్ ॥ 5

*తాత్పర్యము :* అవ్యయము, శాశ్వతము, స్థిరము అగు తత్త్వమును దర్శించుచు జీవించు వానికి అధ్యాత్మ స్థితి నిత్య ముండును. అహంకార మమకారాది భావము లుండవు. సంగ దోషముండదు. సుఖ దుఃఖములవంటి ద్వంద్వము లుండవు. అజ్ఞానము ఆవరించదు.

*వివరణము :* మూలతత్త్వమును అన్నిట అంతట దర్శనము చేయు దీక్ష గలిగిన వారికి క్రమముగ అన్నిట అదియే గోచ రించుచు నుండును. చిల్లర భావము లుండవు. కోరిక లుండవు. పరిసరదోషము లంటవు. సుఖదుఃఖాది ద్వంద్వము లుండవు. జ్ఞాన విజ్ఞానముల నార్జించు శ్రమ యుండదు. ఇది అత్యంత సూటియగు సాధన.

మానాభిమానములు ఉండరాదని, మమకారములు కలుగ రాదని, కోరిక లుండరాదని ఎన్ని దంభములు పలికినను మూల మగు వస్తువును కూడి యుండనపుడు ప్రకృతి వశులై జీవులు అనేక వికారములు చెందుదురు. ఎంత పండితులైనను పరిస్థితి ఇదియే. అట్టి సమయములందు చదివిన శాస్త్రములుగాక, నిర్వర్తించుచున్న దీక్షయే పనికివచ్చును. నిత్య జీవితమున ఆది పురుషుని దర్శించు ప్రయత్నమున యున్నవానికి దురభిమానము, మోహము తగ్గుచు నుండును. కేవలము తగ్గించు కొనవలెనను ప్రయత్నము చాలదు. అంతటికి మూలమైన దానిని స్మరించుచు, దానితో ముడి పెట్టుకొనుట వలన మాత్రమే సాధ్యపడును. ఇట్టి నిత్యసాధన యందున్న వారికి సంగదోష ముండదు. ఎచ్చట నున్నను అన్నిటికి ఆధారమైన తత్త్వముతో కూడి యుండుట వలన తాను తానుగనే చెదరక యుండును. దొంగల యందైనను, దొరల యందైనను తానుగ నుండును. ధనికుల యందు, పేదల యందు కూడ తానుగనే యుండును. అధికారులు, సేవకులయందు కూడ సంగదోషము లేక తానుగ యుండును. తనవారు, ఇతరులు అను భేదము కూడ యుండదు. అట్లుండవలెనని ప్రయత్నించి నను ఉండుట సాధ్యపడదు. కేవలము మూలమగు తత్త్వముతో కూడి యుండుట వలన సాధ్యపడును. అట్టివానిదే నిత్య ఆధ్యాత్మిక జీవనము.

పై తెలిసిన దీక్షయందు జీవించు వానికి కోరిక లుద్భ వించుట జరుగదు. కర్తవ్యమే యుండును. వాని వ్యత్యాసము తెలియును. ఎంత తెలిసిన వారికైనను ఈ సాధన లేనపుడు కోరికలు కర్తవ్యములుగ భ్రమ గొల్పును.

మూలమును దర్శించు ప్రయత్నమే శుభకరము. ఆత్మ మూలుని దర్శించుట వలననే గజేంద్రుడు సమస్తము నుండి ముక్తుడైనాడు. సుఖదుఃఖాది ద్వంద్వములు, మూఢత్వము ఇత్యాది వన్నియు మూలమును దర్శించు ప్రయత్నమున సమసి పోవును. అన్నియు సమసిపోయినచో, మూలప్రాప్తి జరుగునని భావించుట చీకటి తొలగినచో వెలుగు వచ్చునని భావించుట వంటిది. వెలుగేర్పరచుకొన్నచో చీకటి సమసిపోవును గదా! చీకటి పోవుట, వెలుగు వచ్చుట అను రెండు ప్రక్రియలు లేవు. వెలుగు రాగానే, చీకటి పోవును. సాధన మూలమును దర్శించుట ఒక్కటియే! ఇతరము లన్నియు అపుడవరోధములు కావు. మోహము పోవలెను, దుస్సాంగత్యము పోవలెను, కోరికలు కలుగరాదు, ద్వంద్వము లుండరాదు అని కేవలము భావించు వారు, వచించువారు, ప్రవచించువారు ఆ అంశముల యందే చిక్కుపడి యుందురు. సాధన చేయువానికే సిద్ధి. దృఢమైన చిత్తముతో మూలప్రాప్తికై యత్నించుట ముఖ్యసూత్రము. ఈ మూలప్రాప్తినే పురుషోత్తమ ప్రాప్తియని, ఆది పురుష ప్రాప్తియని, అవ్యయ పదమని పలుకుదురు.

## 6

# బ్రహ్మపదము

**న తద్భాసయతే సూర్యో న శశాంకో న పావకః ।
యద్గత్వా న నివర్తంతే తద్ధామ పరమం మమ ॥ 6**

తాత్పర్యము : ఎచ్చట సూర్యచంద్రులు భాసించలేరో, ఎచ్చట అగ్ని ప్రకాశము కోల్పోవునో, దేనిని చేరినచో వెనుతిరిగి పోలేరో అట్టి పరము, శ్రేష్ఠమైన స్థానము నా యొక్క స్థానము.

వివరణము : "నేను" అను ప్రజ్ఞకు మూలమగు స్థానమును కూడ "నేనే" అని పిలుతురు. మూలస్థానము నిత్యము, నిశ్చలము, పరము. అందుండి పుట్టిన నేనునకు జాగ్రత్ స్వప్న నిద్ర అవస్థ లున్నవి. కాని "నేనుకు, నేనైన నేను"కు యిట్టి అవస్థాత్రయము లేదు. ఆ నేను నిదురపోదు. ఆ నేనుకు స్వప్నము లేదు. మెలకువా లేదు. నిదురపోయినచో గదా మెలకువ. ఇట్టి నేనైన నేను నుండే కాలము, ప్రకృతి, సంకల్పము ఉద్భవించి మహత్తుగ ఏర్పడును. మహత్తు నుండి మూడు గుణము లేర్పడును. అందుండియే సమస్త సృష్టి ఏర్పడును. తారకా మండలములు, సూర్య మండలములు, చంద్ర మండలములు,

భూమండలములు ఏర్పడును. అన్నిటియందలి కాంతి దాని కాంతియే.

సృష్టి యందేదియును తనకు తానుగ భాసించుట, ప్రకాశించుట లేదు. అన్నిటియందలి కాంతియు అదియే. అట్టి అమేయమైన కాంతి మూలతత్త్వము యొక్క కాంతియే. అదియే యిదిగా వెలుగుచున్నది. స్వయమగు వెలుగు, తెలివి ఎవ్వరికిని లేవు.

సూర్యునియందు కాంతియైనను, చంద్రునియందు కాంతియైనను, అగ్నియందు కాంతియైనను పరముయొక్క అమేయము, అవ్యక్తము అగు వెలుగు. ఆ కాంతియే మన కన్నుల యందు కాంతిగూడ. ఒకరి నొకరు చూచుకొనుచున్నపుడు దానినే చూతుము గాని, గ్రహింపలేము.

ఈ శ్లోకమున సృష్టియందు వెలుగుచున్న సమస్తకాంతులకు మూలస్థానమును స్మరించుట నిర్దేశింపబడినది. ఆ పదమును చేరుట నిర్దేశింపబడినది. అట్టి పదము చేరినవారు వెనుకకు మరలి రానవసరము లేదు. చక్రభ్రమణమున క్రిందుమీదులు అగుచు అలసట పడవలసిన అగత్యము లేదు. అట్టి మూలమును చేరుటయే పురుషోత్తముని చేరుటగ ఈ అధ్యాయము మరల మరల గుర్తుచేయు చున్నది. ఇట్టి బ్రహ్మపదమును పొందినవారు బ్రహ్మమునందే వసింతురు. బ్రహ్మ సంకల్పముగ దిగివచ్చినను

వారిని సృష్టివృక్షము చిక్కులు పెట్టదు. సనక సనందనాదులు, రుద్రులు, ప్రజాపతులు, దేవర్షి నారదుడు యిట్టి కోవకు చెందిన వారు. బ్రహ్మపదమునకు మార్గము తెరచి ఉంచి, ఆ మార్గమున పయనించు జీవులకు వీరు తోడ్పడుచు నుందురు. ఇట్టి పరంపర బ్రహ్మము నుండి భూమి వరకు ఒక సోపాన క్రమమున అమర్చబడి యున్నవి. వారందరును పరబ్రహ్మమునకు ప్రతీకలుగ అన్ని లోకములయందు నిండియున్నారు. భూమి యందు ఇరువది నాలుగు (24) సిద్ధులుగ వసించి యున్నారని పెద్దలు తెలుపుదురు.

7

## నిత్యభావన

**మమైవాంశో జీవలోకే జీవభూతస్సనాతనః ।**
**మనఃషష్ఠానీంద్రియాణి ప్రకృతిస్థాని కర్షతి ॥ 7**

*తాత్పర్యము :* నా అంశయే జీవలోకమున జీవులుగ నున్నది. జీవులు సనాతనులు. పుట్టిన జీవుని చుట్టును మనసు, ఇంద్రియములు ఆవరింపబడి యున్నవి.

*వివరణము :* జీవుల యందలి మూలము దైవమే. దైవ మనే వెలుగు జీవుడుగ ఏర్పడినపుడు ప్రకృతి నాకర్షించును. మనసు, ఇంద్రియములుగ ఆవరణలు కట్టుకొనును. మూలమున జీవుడు దైవమే. ప్రకృతి యందు మనసేంద్రియములచే బద్ధుడగును. తన నిజస్థితిని ప్రకృతి ఆకర్షణ వలన మరచిపోవును. తనను తాను మరచుటకు కారణము తన మనసేంద్రియములే. కనుక ప్రతినిత్యము దైవమే తానుగ నున్నాడని గుర్తుతెచ్చుకొనుచు నుండవలెను. ప్రకృతి కారణముగ మరపు కలుగుచుండును. మరచినపుడెల్ల ప్రకృతి ఆకర్షణలకు లోనగును. గుర్తు వచ్చినపుడెల్ల

తాను బద్ధుడగు చున్నాడని తెలియును. మరపే బంధమునకు కారణము. జ్ఞప్తి యుండుటయే మోక్షమునకు ఉపాయము. ఆత్మసిద్ధికి జ్ఞప్తియే ఉపాయము. ఇతర సాధనలు యింతకన్న సూటియైనవి కావు.

దీనిని తెలుపుటకే "సోహం-శివోహం" అను మంత్రములు తెలుపబడినవి. భావము నిలచుట ప్రధానము. కేవలము మంత్రము వల్లెవేయుట వలన యిది సిద్ధించదు. భావము నిత్యము నిలుచుటకు నిత్య ప్రయత్నము సాగవలెను. ఈ ప్రయత్నమునకు మనస్సునందలి ప్రభావము అడ్డుపడుచు నుండును. మరచినపుడెల్ల జ్ఞప్తి తెచ్చుకొనుటయే మార్గము. లేనిచో ఇంద్రియములు, మనసు ప్రపంచములోనికి ఆకర్షించి తిప్పలు పెట్టును. జ్ఞానులు, యోగులు ఈ సత్యమును మరువక యుందురు. ఇతరులకు దీక్ష వలన యిది సిద్ధించును.

"దైవమే నా యందు నేనువలె యున్నాడు" అనెడి నిత్య భావన సత్యమునకు దారి చూపును. మంత్రము, యంత్రము, తంత్రము యిత్యాదివి మూలభావమును మరచి చేసినచో నిరుపయోగమై యుండును. భగవద్గీత భగవంతుని చేరుకొనుటకు అత్యంత సులభమగు ఉపాయములను యిచ్చును. కాని మనసున రజస్తమస్సుల ప్రభావము హెచ్చుగ నున్నపుడు యిట్టి

సులభమగు ఉపాయములు తలకెక్కవు. అదియే సృష్టి విచిత్రము లేక మాయ. మాయను పడకుండునట్లుగ మనసును దైవముతో అనుసంధానము చేసి నిత్యకర్మమును నిర్వర్తించుకొను వానికి జీవితము తృప్తిని, సుఖమును యిచ్చును. ఈ శ్లోకమందలి సాధనా రహస్యములు ఎట్టి గూడార్థములు లేక సూటిగ చెప్పబడినవి.

## 8

# సాంగత్యము

శరీరం యదవాప్నోతి యచ్చాప్యుత్క్రామతీశ్వరః ।
గృహీత్వైతాని సంయాతి వాయుర్గంధానివాశయాత్ ॥ 8

*తాత్పర్యము :* పుష్పము ఆదిగా గల స్థావరముల మీదుగ వీచు గాలి, వాని గంధమును కొనిపోవునట్లు- శరీరమును పొందునపుడు, విడచునపుడు జీవుడు పూర్వవాసనలను తనతోపాటు తీసుకొని పోవును.

*వివరణము :* జీవుడు శరీరమును పొందునపుడు మనసు, ఇంద్రియముల ద్వారా అనేక విషయవాంఛలను పొందును. జీవుడు స్వయముగ ప్రకాశవంతుడు, నిర్మలుడు కూడ. శరీరము పొందుటకు కారణము అనుభూతిపై అన్వేషణ. ఆనందమునకై అన్వేషణ. అట్టి అన్వేషణమున ప్రకృతి ఆకర్షణలకు లోనగును. "ప్రకృతిస్థాని కర్షతి" అని ముందు శ్లోకమున చెప్పబడినది. దైవాంశ యగు జీవుడు అనుభూతికై శరీర ధారణము చేయుట, మనసేంద్రియములు ప్రకృతి ఆకర్షణలకు లోనగుట సహజము. తన మూలము తనకు జ్ఞప్తి యుండనపుడు ప్రకృతి మరింత

బలముగ ఆకర్షించును. అపుడు జీవు డవశుడై తన నిజస్వరూపము మరచి, విచక్షణను కోల్పోయి విషయములందు చిక్కుకొనును. దానివలన వాసన లేర్పడును. సువాసన యైనను, దుర్వాసన యైనను బంధించును. అంతేకాక జీవుడు శరీరము వదలినపుడు వాసనలు వెంటనంటును. వాయువు సుగంధ పుష్పముల మీదుగ చనినపుడు ఆ సుగంధ వాసన వాయువుతోపాటు చనును గదా! దుర్గంధము మీదుగా వీచునపుడు, కొంత దూరము దుర్గంధము కూడ వ్యాపించును గదా! వాయువునకు సహజముగా వాసన లేదు. సాంగత్యము వలన వాసన. అట్లే జీవునికి గూడ శరీర సాంగత్యము వలన శుభాశుభ వాసనలు ఏర్పడి జీవునిపై ప్రభావము చూపును. శుభకర్మలు శుభవాసనల నిచ్చును. అశుభ కర్మలు అశుభవాసనల నిచ్చును. దుష్కర్మలు దుర్వాసనల నిచ్చును. వాసన ఏదైనను అది బంధమే.

ప్రకృతి విషయము ఆస్వాదించవచ్చునుగాని, వాని కాకర్షింప బడి, జీవుడు బానిసకారాదు. ఏ వాసన అభ్యాసమై స్థిరపడునో ఆ వాసన శరీరము వదలినను వెంటవచ్చును. శుభవాసనలు కూడ అట్లే. సాధకులు సిద్ధికొరకై ఏర్పరచుకొను నియమములు, సిద్ధి పొందిన వెనుక విసర్జింప లేకపోవుటకు కూడ కారణమిదియే. కట్టుబాట్లు ఏమైనను కట్టుబాట్లే. శరీరమందున్నపుడు ఏర్పడిన కట్టుబాట్లు కూడ, శరీరము విడచిన వెనుక అభ్యాసవశమున జీవునితోనే యుండును. ఇట్లు వివిధమైన కట్టుబాట్లతో తన్నుతాను బంధించుకొనువాడు తనను మరచుట జరుగును.

సాధకుడైన జీవుడు అభ్యాసవశమున, తన యందేర్పడిన

వాసనలను గుర్తించి వానిపై స్వామిత్వము నెరపవలెను. ఉదాహరణకు ఉదయమే దంతధావనము గావించి, ఒక కప్పు కాఫీ త్రాగుట అభ్యాసమైన వానికి- ఒకనాడుదయము కాఫీ లభింపనపుడు తేడా పడరాదు. శరీరము వదలిన తరువాత కాఫీ త్రాగుట యుండదు. అపుడు కాఫీ కనిపించుచున్నను త్రాగలేడు. ఇట్టి అవస్థలు శరీరమున్నపుడే దాటు ప్రయత్నము చేయవలెను. అట్లే మద్యము, పొగత్రాగుట, లేచిన వెంటనే సెల్‌ఫోను చూచుట యిత్యాది అలవాట్లు.

శరీరమున్నంత కాలమే ఉండు సౌకర్యములకు వశమైనచో శరీరము లేనపుడు వానిని పొందలేక దుఃఖము పొందును. శాశ్వత విషయములందు అనురక్తి యున్నపుడు, అవి శాశ్వతము గనుక దుఃఖముండదు. శరీరమున్నపుడు మనసు, ఇంద్రియములు అందించు ఆకర్షణ, అనుభూతి పరిమితములని తెలిసి, తాను శాశ్వతుడని తెలిసి వర్తించువాడు సుఖపడును. ఇతరులు వాసనా బద్ధులై సుఖదుఃఖములకు లోనగుచుందురు. ఈ సత్యమెరిగి జీవించుట ఉత్తమము.

జీవుని అనంత ప్రయాణమున అనేకానేక సాంగత్యములు, తదనుగుణమగు అనుభూతులు వచ్చి పోవుచు నుండును. వాని ద్వారా పొందవలసిన అనుభూతి, ఆనందమును పొందుచు జీవుడు పరిపూర్ణుడగుటయే ఈ జన్మ పరంపరల పరమావధి. తన మూల మెరిగినవాడు దేహ మూలముగ తనను ఎరిగి, తాను దేహియని, దేహిగ దైవాంశయని, తన శరీరమొక సౌకర్యమేగాని, తాను కాదని తెలిసి చరించును. అట్లు కానిచో వాసనలు బంధించును.

9

## విమూఢుడు

శ్రోత్రం చక్షుః స్పర్శనం చ రసనం ఘ్రాణమేవ చ ।
అధిష్ఠాయ మనశ్చాయం విషయా నుపసేవతే ॥ 9

ఉత్క్రామంతం స్థితం వాపి భుంజానం వా గుణాన్వితమ్ ।
విమూఢా నానుపశ్యంతి పశ్యంతి జ్ఞానచక్షుషః ॥ 10

*తాత్పర్యము :* 1. వినువాడు, 2. చూచువాడు, 3. రుచి చూచువాడు, 4. స్పర్శించువాడు, 5. వాసన చూచువాడు, 6. మనస్సు నధిష్ఠించి ప్రపంచ విషయములను నిత్య మనుభవించువాడు, 7. ఒక శరీరము నుండి మరియొక శరీరమునకు బయలుదేరుచుండు వాడు, 8. శరీరమున నుండువాడు, 9. గుణములతో కూడి మనసేంద్రియములతో ప్రకృతి ననుభవించు వాడు నిజమునకు జీవుడే. ఇన్ని తెలియువాడు తనను తా నెరుగడు. జ్ఞానమను కన్ను విచ్చుకొనినచో ఎరుగగలడు.

*వివరణము :* దైవమే జీవుడుగ దిగివచ్చు చున్నాడని ఏడవ శ్లోకమున చెప్పబడినది. శరీరము పొందిన జీవుడు మనసేంద్రియ

ముల ద్వారా ప్రకృతికి ఆకర్షింపబడు చున్నాడని కూడ తెలియును. ప్రకృతితో పరస్పర సంబంధమున అతనికి వాసన లేర్పడుతున్నవని ఎనిమిదవ శ్లోకమున తెలుపబడినది. వాసనలు కారణముగ మరల మరల శరీరమునకు ఆకర్షింపబడు చున్నాడని కూడ ఎనిమిదవ శ్లోకమున తెలుపబడినది.

ఇంతకును యివి అనుభవించు వాడెవడు? వినుచున్న వాడెవడు? చూచుచున్న వాడెవడు? స్పర్శించుచున్న వాడెవడు? రుచి చూచువాడు, వాసన చూచువాడు ఎవడు? మనసు నధిష్ఠించి విషయములను అనుభవించు వాడెవడు? లేచువాడు, కూర్చున్న వాడెవరు? భుజించుచున్న వాడెవరు? సత్వాది గుణములను ఆశ్రయించిన వాడెవడు? **తానే. ముమ్మాటికి తానే.** కాని విచిత్ర మేమనగా తానెవ్వడో తాను మరచినాడు. తనకెన్ని తెలిసినను, ఎన్ని అనుభవించినను, తన్ను తాను మరచినవాడు, తన్ను తాను ఎరుగని వాడు మూఢుడు కాదా! ముమ్మాటికి మూఢుడే. ఎన్ని తెలిసినను మూఢుడే. కనుక విమూఢుడని దైవము సంబోధించి నాడు. ఇట్టి వానిని తెలిసిన మూర్ఖు డందురు. తన్నుతాను తెలియక, తనకెన్ని తెలిసిన ఏమి ఫలము?

1. తాను దైవాంశ అని మరచినవాడు అజ్ఞాని.

2. అజ్ఞానమను ఆవరణమున అహంకారమను ఆవరణ మేర్పడును.

3. అహంకారము వలన మమకార మేర్పడును.

4. మమకారము వలన విషయాసక్తి ఏర్పడును.

5. పర, తమ భేదము లేర్పడును.

6. అటుపైన వాసన లేర్పడును.

7. వాసనల వలన జన్మ పరంపర లేర్పడును.

8. వాసనలు గుణములుగ స్థిరపడి సత్వము చెదరును. దానివలన సమతుల్యము చెడిపోవును.

9. సమతుల్యము చెడుటవలన కర్మలయందు కారణము పుట్టును.

10. కారణము వలన కర్మ పుట్టును. కార్యకారణ చక్రమొకటి ఏర్పడును. ఇట్లు ఆవృత్తములు అనంతముగ ఏర్పడుచు, జనన మరణ చక్రమున చిక్కుపడి శాశ్వతముగ బద్ధుడగును.

ఈ మొత్తమునకు ఔషధ మొక్కటియే. తానే దైవమని గుర్తు తెచ్చుకొనుట (సోహం, శివోహం). ఇట్లు గుర్తు తెచ్చు కుంటున్న కొలది, క్రమముగ తన చుట్టును ఉన్నది కూడ దైవసంబంధమే అని తెలియును. తానే దైవమను నిత్యభావన కనువిప్పు కలిగించి, దైవమే తాను అని తెలియును. తాను దైవమే

అనుకొనుట అహంకారము. దైవమే తానని తెలియుట జ్ఞానము. అప్పుడొక్కమారుగ సమస్తము దైవమే అని మరియొక కనువిప్పు కలుగును. అపుడు బంధించిన ఆవరణము లన్నియు కరగి పోవును. దుస్వప్నము నుండి మేల్కాంచినట్లు తన్ను తానెరుగును.

పై అవరోహణ, ఆరోహణ సోపానము తెలియుట చాలదు. ఆచరించుట వలననే తెలియును. అట్టివాడు దేహాత్మభావన యందు గాని, జీవాత్మ భావన యందుగాని చిక్కుబడక, పరమాత్మ యందు కరగియుండును. పరమాత్మయే తానుగా నుండును.

## ⑩

## నిత్య సాధన

**యతంతో యోగినశ్చైనం పశ్యంత్యాత్మన్యవస్థితమ్ ।**
**యతంతోఽప్యకృతాత్మానో నైనం పశ్యంత్య చేతసః ॥ 11**

*తాత్పర్యము :* నిత్య ప్రయత్నము చేయుచున్న యోగులు తమయందు విరాజిల్లియున్న పరమాత్మను దర్శించగలుగు చున్నారు. అట్టి ప్రయత్నము లేనివారు ఆత్మను దర్శింపలేకున్నారు.

*వివరణము :* వంట ప్రయత్నము లేక భోజనము లభింపదు. సాధన లేక ఏమియు సిద్ధింపదు. వంట జరుగుచున్నంతసేపు పొయ్యి మండుచునే యుండవలెను. మంట తగ్గినచో వంట ఆగును. పొయ్యార్పినచో ఉడికీ ఉడకని పదార్థము వ్యర్థమై పోవును. ఏ విషయమందైనను సిద్ధి పొందుటకు సాధన నిత్యమై సాగవలెను. శ్రద్ధగా ఒకే తీరున సాగవలెను. హెచ్చుతగ్గులు పనికిరావు.

తొమ్మిదవ అధ్యాయమున భగవానుడు తన నెరుగుటకు, తనను పొందుటకు ఉపాయము తెలిపినాడు. అనన్యచింతన, పరి ఉపాసన, నిత్య అభియుక్తత. ఈ మూడింటివలన తనతో

కూడి యుండవచ్చునని తెలిపినాడు. తన యందలి ఈశ్వరునితో తాను కలసి యుండవలెను. కలసి యున్నట్లు తెలిసియుండ వలెను. అట్లు తెలిసియుండుట వలన తనయందలి ఈశ్వరునితో కూడుట సిద్ధించును. యోగులెపుడును అట్టి ప్రయత్నముననే యుందురు. యోగులు నిత్య ధ్యానులు. వారు అన్నిటియందును దైవమును చూచు ప్రయత్నమున యుందురు. అన్ని కాలము లందు అదే ప్రయత్నమున నుందురు. అన్ని ప్రదేశముల యందు కూడ అదే ప్రయత్నము. అన్ని రూపముల యందు, నామముల యందు గూడ వానినే చూచుచుందురు. కనుక వారికి తమ లోపల బయటగల ఈశ్వర సాన్నిధ్యము లభించుచునే యుండును. శ్వాస ఉన్నంత వరకు ఆ ప్రయత్నము కూడ సాగును. నిత్య ప్రయత్నమున ఉండుటవలన వారు యోగులుగ నిలచి యున్నారు. ఏ ప్రయత్నము చేయనివారికి ఈశ్వరప్రాప్తి కలుగదు. నిత్యసాధన యందున్న వారికి సాధ్యము కానిది ఏమీ యుండదు. ఇట్టి నిత్యసాధన లేక కేవలము భగవత్ప్రాప్తి నాశించువారు ఎప్పటికిని ఈశ్వర సాన్నిధ్యము పొందలేరు. భగవంతుని పూజించుట, ధ్యానించుట, భగవత్కార్యములు చేయుట మాత్రమే చాలదు. అన్ని కాలములయందు, అన్ని దేశములందు, అన్ని రూపముల యందు, అన్ని నామములయందు దానినే చూచుట, వినుట, గమనించుట చేయువారికి లోపల, బయట వ్యాప్తిచెంది యున్న ఈశ్వర దర్శనము తప్పక కలుగునని ఈ శ్లోకము హెచ్చరించు చున్నది.

(11)

## స్వయంప్రకాశకుడు

**యదాదిత్యగతం తేజో జగద్భాసయతేఽఖిలమ్ ।**
**యచ్చన్ద్రమసి యచ్చాగ్నౌ తత్తేజో విద్ధి మామకమ్ ॥ 12**

*తాత్పర్యము :* సూర్యుని యందలి తేజస్సు, చంద్రుని యందలి ప్రకాశము, అగ్నియందలి తేజస్సు నేనే అని తెలియుము.

*వివరణ :* పరతత్త్వము పేరు "నేను". దాని వెలుగే సమస్త సృష్టియందు వ్యాపించి యున్నది. మనయందు గూడ ఆ వెలుగే ప్రకాశించు చుండుట వలన మనము కూడ "నేను" అను చున్నాము. ఈ నేనను వెలుగే సూర్యుని నుండి, అగ్ని నుండి, తేజస్సుగా వ్యక్తమగు చున్నది. చంద్రుని నుండి నక్షత్రముల నుండి కూడ ప్రకాశించు చున్నది. మనము నవ్వునపుడు మన నవ్వు నుండి, కనుల నుండి కూడ ప్రకాశించు చున్నది. మణులు, రత్నములు, స్ఫటికములు, బంగారము, వెండి, రాగి వంటి లోహముల నుండి, జలముల నుండి కూడ వ్యక్తమగుచున్నది. ఆకాశము నుండి నిత్యము ప్రకాశించుచునే యున్నది. ప్రకృతి యందు వివిధమగు కాంతులతో ప్రకాశించుచున్నది. సూర్యుని

కిరణముల నుండి ఏడు రంగులుగ ప్రకాశించుచున్నది. ఇది యంతయు భగవంతుని వెలుగే.

స్వంతముగ వెలుగున దేమియు లేదు. దైవమొక్కడే స్వయం ప్రకాశకుడు. దేవతల యందు కూడ ప్రకాశించున దతడే. ఎచ్చట ప్రకాశము గోచరించునో దాని మూలము దైవమే అని భావించుట, గ్రహించుట ఒక దీక్ష. ఈ అంశమును ఎన్నియో మార్లు దైవము తెలిపియున్నాడు. మరల మరల తెలుపుచున్నాడు. ఉదాహరణకు బలవంతుల యందలి బలము నేను. తెలివిగలవారి యందలి తెలివి నేను. అధికారులలో అధికారము నేను. పండితులలో పాండిత్యము నేను. వైద్యులలో వైద్యము నేను. జీవుల హృదయము నేనే. ఇట్లెన్ని విధములుగ దైవము ప్రత్యక్షముగ దర్శన మిచ్చుచున్నను చూడక, చూడలేక దైవదర్శనమునకై తపించువారు మాయను పడినవారే. కనబడుచున్న దైవమును చూచుట మాని, కనబడని దైవమును వెతుకుట అవివేకమే గదా! మూర్ఖత్వమే గదా! చూచువానికి దైవమంతటను కలడు. చూడలేక పోవుట గ్రుడ్డితనము. సూర్యోదయము చూడలేకుండుట, శంఖారావములు వినలేకుండుట, సద్గ్రంథముల యందు ఏవగింపు, నపుంసకుల వివాహకాంక్ష ఇత్యాదివన్నియు నిష్ఫలము లని ప్రహ్లాదుడు పలికినాడు. ప్రకాశించునదెల్ల దివ్య ప్రకాశమే గదా! దాని మూలమే బ్రహ్మము లేక పురుషోత్తముడు.

(12)

# ఈశ్వరప్రాప్తి

**గామావిశ్య చ భూతాని ధారయామ్యహ మోజసా ।**
**పుష్ణామి చౌషధీ స్సర్వా స్సోమో భూత్వా రసాత్మకః ॥ 13**

*తాత్పర్యము :* సృష్టియందు ఏర్పడుతున్న సర్వభూతముల యందు ప్రవేశించి, నా ఓజస్సు అనే బలముతో సమస్త జీవులను ధరించియున్నాను. అట్లే రసాత్మకుడనై భూమియందు ప్రవేశించి, సమస్త సస్యములను వృద్ధి చేయుచు జీవులను పోషించుకొను చున్నాను.

*వివరణము :* పురుషోత్తమ ప్రాప్తియోగమందు పురుషోత్త ముని దర్శించు ఉపాయము లన్నియు ఎనిమిదవ శ్లోకము నుండి దైవము తెలుపుచునే యున్నాడు. జీవకోట్ల నన్నిటిని ఓజస్సను బలముతో దైవమే ధరించి యున్నాడు. చిన్న చిన్న రూపములు గల జీవుల నుండి అతిపెద్ద రూపములు గల జీవుల వరకు అందరిని దైవమే ధరించి యున్నాడు. అట్టి ధరించు శక్తిని ఓజస్సు అందురు. మనయందు మనలను ఈశ్వరుడట్లే ధరించి యున్నాడు.

ధారణ గలవారే ధరించుట, భరించుట చేయుదురు. గ్రహగోళము లను, సూర్యమండలములను, తారకామండలములను తానే ధరించి యున్నాడు. యోగమందలి ఆరవ అంగమైన 'ధారణ' అను స్థితిని చేరినచో మనకు కూడ, మనము శరీరము ధరించి యున్నామని తెలియును. మన శరీరమునకు మనమే ఆధారమని తెలియును. శరీరము మనకాధార మనుకొనుట ఒక తెలివి. శరీరమునకు మన మాధారమని తెలియుట నిజమగు తెలివి. మన మీశ్వర అంశలమని తెలియును. మనకు ఈశ్వరుడు ఆధారమని తెలియును. క్రమముగ ఈశ్వరుడే మనముగ నున్నా మని తెలియును. ఇట్లంచలంచెలుగ ఈశ్వరప్రాప్తి కలుగును. ఇది ఒక ఉపాయము.

అట్లే నేనను పరతత్త్వము సోముడుగ రసస్వరూపు డగును. సోముడనగా ఉమతో కూడిన వాడని అర్థము. ఉమయనగా శక్తి స్వరూపిణి. ఆమె కుడి ఎడమలే జ్ఞానశక్తి, క్రియాశక్తి. ప్రేమతో కూడిన పరతత్త్వము రసస్వరూప మగును. అట్టి రసమే ఇంద్రుడు, చంద్రుడు వంటి వారిని మాధ్యమముగ గైకొని భూమియందు ప్రవేశింపగా ఓషధు లేర్పడుచున్నవి. అనగా ఆహారపదార్థము లేర్పడుచున్నవి. వాటిద్వారా సమస్త జీవులను తానే పోషించుచు నున్నాడు. కనుకనే అన్నమును బ్రహ్మము అనిరి. ఇట్లు ఈశ్వరుని దర్శించుట మరియొక ఉపాయము.

తానే జీవులుగ ఏర్పడినాడు. వారియందు ప్రవేశించి ఈశ్వరత్వ మందినాడు. తానే వారిని ధరించి యున్నాడు. రూప మున్న ప్రతిజీవికిని ఆకలి తప్పదు. ఆకలి తీర్చుటకు కూడ తానే సోముడుగ, ఇంద్రుడుగ, చంద్రునిగ దిగివచ్చి భూమిని వసుమతిగ ఏర్పరచినాడు. ఎన్నో రకములగు రుచికరమైన ఆహార మేర్పరచి నాడు. వాటి ద్వారా జీవులను పోషించుచు యున్నాడు. తృప్తి, ఆనందము కలిగించుచున్నాడు. ఇంతటి బృహత్కార్యము జరుగుచుండగా, చూడలేకపోవుటకు కారణము జీవులకు శుద్ధి లేకపోవుటయే. త్రికరణశుద్ధులై, కృతజ్ఞులై యుండు వారికి ఈశ్వర దర్శన ప్రాప్తి సులభమే. ఇంత సూటిగ తన్ను దర్శించుటకు దైవము ఉపాయము లందించినను, దైవమును చూడలేకపోవుట విచిత్రము. మాయవలన సూటియగు విషయములు గోచరింపక అనేకానేక డొంకతిరుగుడు మార్గములలో ప్రవేశించి, శ్రమపడుచు నుందురు. నిర్మల మనస్సులకే ఉన్నది సూటిగ కనిపించును. కనుకనే ఈ అధ్యాయములో ఆది నుండియు అన్నిటి మూలమును చూడుడని హెచ్చరించినాడు.

## 13

# వైశ్వానరుడు

**అహం వైశ్వానరో భూత్వా ప్రాణినాం దేహ మాశ్రితః ।**
**ప్రాణాపాన సమాయుక్తః పచామ్యన్నం చతుర్విధమ్ ॥ 14**

*తాత్పర్యము :* నేను ప్రాణుల యొక్క శరీరమందు వైశ్వానరుడు అను జఠరాగ్నిగా వసించి యున్నాను. పానము, అపానము అను వాయువులతో కూడుకొని నాలుగు విధములుగ అన్నము పచనము చేయుచున్నాను.

*వివరణము :* మన దేహమందలి జఠరాగ్ని వలన మనకు ఆకలిదప్పులు కలుగుట, ఆహారము స్వీకరించుట, స్వీకరించిన ఆహారమును చక్కగా పచనము చేసి నాలుగు విధములుగ దేహమున పంచుట యిత్యాది వెవరు చేయుచున్నారు? దైవమే దేహమందు పదిరకముల అగ్నిగా వసించి అనేక కార్యములను నిర్వర్తించుచు నున్నాడు. అందు ముఖ్యముగ వైశ్వానర అగ్నిగా దేహమును పుష్టిగ నిలిపి యున్నాడు. ఈ ప్రక్రియ లేనిచో దేహమున జీవుడుండలేడు. ఆహార స్వీకరణము, అరుగుదల అత్యంత ప్రధానమగు విషయములు. అవి నిర్వర్తించుటకు

జఠరాగ్ని, ప్రాణాపానములు ప్రధానము. ఉదరమందలి ఈ అగ్ని వలననే ఆకలి పుట్టును. ఆకలి పుట్టవలెనన్నచో పూర్వము స్వీకరించిన ఆహారము పచనమై దేహమందలి నాలుగు కోశములు బలపడవలెను. బలమగు చతుర్కోశములు మరల స్వీకరించిన ఆహారమును ఇంధనమువలె వినియోగించును. ఇంధన మైపోవగనే మరల ఆకలి రూపమున అన్నము కోరును. ఈ మొత్తము కార్యము ఉదరమందలి అగ్ని ప్రాణాపానములతో కూడి నిర్వర్తించును.

స్వీకరించిన ఆహారము అన్నమయ కేంద్రమున పచన మగును. పచనమైన వెనుక అది శక్తిగ మారును. ఆ శక్తిని ప్రాణముల ద్వారా అన్నమయ, ప్రాణమయ, మనోమయ, బుద్ధిమయ కోశములకు పంచును. ఈ నాలుగు కోశములకు ఆహారము యొక్క ఆవశ్యకత యున్నది. అన్నము కేవలము భౌతిక శరీరము కొరకే అనుకొనుట స్థూలమగు అవగాహన. పచనము గావింపబడిన అన్నము ప్రాణమునకు, మనసేంద్రియములకు, బుద్ధికి కూడ బలమిచ్చును. అందువలన అన్నము నాలుగు విధములుగ పంచబడుచున్నదని తెలియజెప్పుచున్నారు. సమగ్రము, సమతుల్యము అగు ఆహారము శరీరమందలి నాలుగు కోశములకు బలమిచ్చును. జీవుడు ఆహారము స్వీకరించుట తనకొరకు గాదు. తన దేహము కొరకు. దేహము

జీవుని వాహనము. జీవుని ప్రయాణమునకు ఉపకరణము. సమగ్రమగు ఆహారము సకాలమున దేహమునకు సమర్పింప వలెను. స్కూటరు, కారు నడచుటకు వలసిన ఇంధనము ఈయ వలెను. అట్లే శరీరమునకుగూడ. స్కూటరు యజమాని తాను పెట్రోలు త్రాగుట లేదు. వాహనమున కిచ్చు చుండును. తన దేహ ఆవశ్యకతను ఎరిగి, అనుగుణమైన ఆహారమును అందించుట జీవుని కర్తవ్యము. దానిని పచనము చేసి నాలుగు కోశముల కిచ్చుట దైవము చేయుచున్నాడు. ఇట్టి అవగాహన లేక భుజించు వాడు పశువుతో సమానము.

మానవ దేహమున వాక్కునందు, ఆలోచన యందు, చేతల యందు, హృదయమందు, చివరకు శుక్రమందు కూడ దైవము అగ్నిగా పనిచేయు చున్నాడు. అందు మూడగ్నులు ఊర్ధ్వలోక ప్రాప్తికి వినియోగపడును. ఏడగ్నులు సప్తకోశముల నిర్వహణకు ఉపయోగపడును. ఈ ఏడగ్నులలో మధ్యస్థమై నాలుగవ అగ్నిగా వైశ్వానర అగ్ని తెలుపబడినది. వివరములకు భాగవత మందలి పంచమ స్కంధమున మనుకుమారుడైన ప్రియవ్రతుని సంతాన వృత్తాంతము పరిశీలింపుడు.

ఆహారము స్వీకరించునపుడెల్ల ఈ శ్లోకమును పఠించుట వలన జఠరాగ్ని సంతసిల్లి జీవులకు తోడ్పడునని తెలిసి ఈ శ్లోక పఠనము అభ్యాసము చేయవలెను.

## 14

## హృదయ స్పందనము

సర్వస్య చాహం హృది సన్నివిష్టో
మత్తః స్మృతి ర్జ్ఞాన మపోహనం చ ।
వేదైశ్చ సర్వై రహమేవ వేద్యో
వేదాంతకృ ద్వేదవిదేవ చాహమ్ ॥ **15**

*తాత్పర్యము :* నేను సమస్త ప్రాణుల హృదయములందు యున్నవాడను. నా వలననే ప్రాణులకు జ్ఞాపక శక్తి, మరపు, తెలివి కలుగుచున్నవి. సర్వ వేదములు నేనే. వానిని తెలిసిన వాడను కూడ నేనే. వేదాంతము కూడ నేనే.

*వివరణము :* సృష్టియందు దైవము కాని దేదియు లేదు. దైవము లేక మరియొకటి యుండదు. పిండి లేనిదే రొట్టె లేదు. చపాతీ లేదు, పూరీ లేదు, పిండివంట లేదు. మూలము లేనిదే వస్తువు లేదు. వస్తువేర్పడినపుడు మూలము మరుగున పడును. మరుగున ఉండుటచే, ఉన్నదానిని మరచుట జరుగును. పునాది రాయి లేనిదే భవనము లేదు. భవన మేర్పడిన వెనుక పునాది మరుగు అగును. అట్లే విత్తనము మహా వృక్షమైనపుడు, విత్తనము

గోచరింపదు. ఇట్లు సమస్తమునకు మూలమైన దైవము మనయందు హృదయ స్పందనగ యున్నాడు. కాని మనము గుర్తించము. మన ఆలోచనలకు మూలమగు తెలివిగ కూడ యున్నాడు. మనము గుర్తించము. మనకు మరపు కలుగుట, గుర్తు వచ్చుట కూడ అతని అధీనముననే యున్నది.

ఈ సమస్తము తన నుండే వ్యక్తమైనది. అంతయు తానే వ్యాపించి యున్నాడు. కనుక అతనికి తెలియని దేమియు లేదు. అనాదిగ నున్న వానికి తరువాతిగ ఏర్పడిన వన్నియు తెలిసియే యుండును. సృష్టికథ ఆరంభమైన తరువాత ఏర్పడిన వానికి స్వతహాగ అంతయు తెలియదు. కనుక అతడే వేద్యుడు. అతనికి మరపుండదు. ఇతరులకు మరపుండును. అట్టి పరమాత్మను, తమ హృదయ స్పందనముగ ఎరిగి అనుసంధానము చెందినచో క్రమముగ సమస్తము తెలియుట ప్రారంభించును.

(15)

## కూటస్థుడు

**ద్వావిమౌ పురుషౌ లోకే క్షరశ్చాక్షర ఏవ చ ।**
**క్షరస్సర్వాణి భూతాని కూటస్థో௨క్షర ఉచ్యతే ॥ 16**

*తాత్పర్యము :* ఈ లోకమందు క్షరుడనియు, అక్షరుడనియు ఇద్దరు పురుషు లున్నారు. అందొకడు కర్మ నిర్వాహకుడుగను, మరియొకడు వానికి మూలముగను యున్నారు.

*వివరణము :* జీవుడు బాహ్యమందలి ప్రకృతికి ఆకర్షింపబడి, మనసు, జ్ఞానేంద్రియములు, కర్మేంద్రియములతో కూడి ప్రపంచ మున తీరుబడిలేక పనిచేయుచుండును. మరియొకడు వాని లోపల, వాని మూలమున కూర్చొని యున్నాడు. మానవుడు విశ్రాంతి యందున్నపుడు, తనయందు తాను స్థిమితముగ నుండును. గృహ యజమానివలె లోపల తనదైన స్థానమున స్థిరముగ నుండును. ఇతడు లోపలివాడు. ప్రకృతిచే ఆకర్షింపబడినపుడు మనసు, దశేంద్రియములు, శరీరము కూడగట్టుకొని తిరుగుచు నుండును.

ఇట్లు మనసునందు భావములు గైకొని ఇంద్రియములతోను, శరీరముతోను కార్యములు చేయుచు, రకరకములగు సంబంధము

లను, అనుబంధములను, బంధములను ఏర్పరచుకొనును. ఆస్తులు పాస్తులు సంపాదించుకొనును. స్థితిగతు లేర్పరచుకొనును. ఎన్నిచేసినను వీటన్నిటికి అంతముండదు. ఇవియన్నియు తనతో కూడిరావు. ఇవియన్నియు క్షరములు. వీనితో మమేకమై తిరుగు వాడు తన మూలస్థానము యొక్క అనుబంధము మరచును. క్షరములతో అనుబంధము వలన క్షరుడగును. అనగా మరణము ననుభవించును. మరల మరల దేహమును ధరించి అభ్యాస వశమున మరల అదే పనిని చేయుచుండును.

కాలక్రమమున అనుభవైక జ్ఞానమును కలిగిన, క్రమముగ నిత్య - అనిత్య అంశములను జీవితమున గుర్తించును. ఏది శాశ్వతము, ఏది అశాశ్వతమో తెలుసుకొనును. ఇట్లు వివేకము కలుగుచుండగ, తాను నిత్యుడని, తన చుట్టును ఏర్పడిన సమస్తము తనతో శాశ్వతముగ నుండవని తెలియును. మరికొంత జ్ఞానము కాలక్రమమున సంతరించినపుడు మనసు, ఇంద్రియములు శరీరము కూడ తనచుట్టునూ ఏర్పడిన సౌకర్యములేగాని, తాను కాదని తెలియును. తాను నిత్యుడు. తన మనో భావములు నిత్యము కావు. తన ఇంద్రియములు నిత్యము కాదు. తన శరీరము నిత్యము కాదు. తాను నిత్యుడని తెలిసి, తాను తన తెలివి మాత్రమే శాశ్వతమని, ఇతరము లేవియు శాశ్వతముకావని తెలియును. అట్లు తన లోపలయున్న తానును క్రమముగ తెలియుట వలన కదలక, మెదలక తన స్థానమున స్థితప్రజ్ఞునివలె కూర్చొని యుండును. ఇట్లు తాను అక్షరుడని తెలియును.

అక్షరుడని తనకు తాను తెలిసినవాడు ఇక ప్రకృతి ఆకర్షణలకు లోనుకాడు. కనుక మనసేంద్రియ వ్యాపారమున చిక్కుపడడు. తాను నిర్వహించవలసిన సమస్త కార్యములను, మనసు, ఇంద్రియము, శరీరముల సహకారముతో నిర్వర్తించి తిరోధానము చెంది కూటస్థుడై కూర్చొనును. కాలమును దేశమును బట్టి చేయవలసినవి చేయుచు, ఇతర సమయములలో తనయందు తానుండును. ఇతరములయందు తన ప్రజ్ఞ యుండక, తనయందే తన ప్రజ్ఞ యుండును. శివునితోనే పార్వతియున్నట్లు, మహావిష్ణువుతోనే మహాలక్ష్మి యున్నట్లు, బ్రహ్మదేవునితోనే సరస్వతియున్నట్లు తన ప్రజ్ఞ (తెలివి) తనయందే ఇమిడి యుండును. ఇతర ఆకర్షణలేవియు కలుగనేరవు. అట్టివానికి తాను, తన ప్రజ్ఞ మాత్రమే శాశ్వతమని, తన చుట్టూ ఏర్పడిన మనసు, ఇంద్రియములు, శరీరము, ఆస్తిపాస్తులు, స్థితిగతులు, సంబంధ బాంధవ్యములు- ఇవి యన్నియు తాత్కాలిక సత్యములని తెలియును. వారియందు బాధ్యతా నిర్వహణమే గాని మరి ఎట్టి వ్యామోహము వీలుపడదని తెలియును. ఇట్లు తాను, తనవి అనువాని తారతమ్యము తెలిసి తానుగ నున్నవాడు కూటస్థుడు. అతడే అక్షరుడు కూడ. అజ్ఞానము వలన క్షరత్వము, జ్ఞానము వలన అక్షరత్వము కలుగును. ఈ ఎరుక లేనివానికి క్షరత్వములోనికి జారిపోవుట యుండును.

(16)

# విరాట్పురుషుడు

**ఉత్తమః పురుష స్త్వన్యః పరమాత్మే త్యుదాహృతః ।**
**యో లోకత్రయ మావిశ్య బిభర్త్యవ్యయ ఈశ్వరః ॥ 17**

*తాత్పర్యము :* ఉత్తమ పురుషుడని మరియొక డున్నాడు. అతనినే పరమాత్మ అని కూడ అందురు. అతడు మూడు లోకములను ఆక్రమించియున్నాడు. మూడు లోకములను భరించుచున్నవాడతడే. అత డవ్యయుడు. అతడే ఈశ్వరుడు.

*వివరణము :* ఇట్టి ఈశ్వరుని చేరుటయే పురుషోత్తమ ప్రాప్తి. ఇతడెప్పుడును యుండును. వ్యయము కాడు. పెరుగుట, తరుగుట యితనికి లేదు. ఇతనియందే మూడు లోకములు పుట్టి, పెరిగి, లయము చెందుచున్నవి. అన్ని లోకములు ఇతనియందే యున్నవి. ఇతడన్నిలోకములు నిండియున్నాడు. అంతేకాక భరించి యున్నాడు. ఇతనిని పరమాత్మ అని అందురు. ఇతడే విరాట్పురుషుడు కూడ. క్షర పురుషునకు, అక్షర పురుషునకు కూడ ఇతడే మూలము. కనుక ఉత్తమ పురుషుడు.

ముందు శ్లోకమున చెప్పబడిన క్షరపురుషుని దేహాత్మయని,

అక్షర పురుషుని జీవాత్మయని, ఉత్తమ పురుషుని పరమాత్మయని సంబోధింతురు. దేహాత్మయనగా దేహమే తామనుకొనువారు. జీవాత్మ యనగా దేహములో నున్నాననుకొనువాడు (కూటస్థుడు). పరమాత్మ అనగా వీరిరువురిని మించి, లోకము లన్నిటిని మించి, సర్వము వ్యాప్తిచెంది యజమానిగ నున్నవాడు. ఈ పరమాత్మయే ఈశ్వరుడు. అతనిని కూడినవాడు అతనివలననే శాశ్వతుడు, అవ్యయుడై యుండును. అతనిని కూడుటకు జీవుడు తాను దైవాంశయే అని గుర్తుండవలెను. కాని మనసేంద్రియములద్వారా ప్రకృతికి ఆకర్షింపబడి తాను దైవాంశయని మరచును. దైవముతో కన్న దేహముతో సాంగత్యమెక్కువై, తనదేహమే తానను అవస్థితి చెందుట జరుగును. ప్రకృతితో సంగదోషము వలన జీవుడు తనను తాను మరచి యున్నాడు. ఈ సంగము వలన గజిబిజిగ అనేకా నేకములగు సంబంధ బాంధవ్యము లేర్పడి, చిక్కుపడి యున్నాడు. అట్లుగాక దైవముతో సంగము క్రమముగ పెంచుకొనినచో, దైవమే తానుగా నున్నాడని తెలిసి వర్తించినపుడు ప్రకృతి సంగము అనుభూతి, ఆనందము యిచ్చునే గాని, బంధము కాజాలదు. దైవ సాంగత్యమును వదలుట వలన జీవుడు తన నిజస్థితి నుండి అవస్థితి పొంది, ప్రకృతియందు బంధితు డగుచున్నాడు.

జీవుని అంకె తొమ్మిది (9). ప్రకృతి అంకె ఎనిమిది (8). దైవము అంకె ఒకటి (1). తొమ్మిది ఎనిమిదితో కలిసినపుడు ఎనిమిదే (9+8=17, 1+7=8) మిగులును. అట్లే దైవముతో

కలసినపుడు (9+1=10, 1+0=1). జీవుడు దైవముతో కలిసియున్న దైవాంశయే యుండును. జీవుడు ప్రకృతితో కలిసిన, ప్రకృతి యందు బంధింపబడి యుండును.

దైవము యొక్క నామము 'అ'. 'అ'తో సంగము ఈ అధ్యాయమున హెచ్చరింపబడినది. అట్లు కూడియున్న వానికి ఉత్తమ పురుష ప్రాప్తి సంభవించగలదు.

(17)

## అపరిమితుడు

**యస్మాత్ క్షరమతీతోఽహ మక్షరాదపి చోత్తమః ।**
**అతోఽస్మి లోకే వేదే చ ప్రథితః పురుషోత్తమః ॥ 18**

*తాత్పర్యము :* నేను క్షర పురుషుని కంటె మించినవాడను. అక్షర పురుషుని కన్న ఉత్తముడను. అందువలన లోకమునందు, వేదమునందుకూడ నన్ను పురుషోత్తముడని పిలుతురు. నేనట్లే ప్రసిద్ధి గాంచినాను.

*వివరణము :* క్షర పురుషు డనగా ప్రకృతి నుండేర్పడిన మానవ రూపము. మానవుని యందు ప్రకృతి అష్టమూర్తులుగ నుండును. మూడు గుణములు, ఐదు ఇంద్రియములతో మానవ రూపము తయారు చేయబడినది. అష్ట ప్రకృతుల రూపమే మానవ రూపము. వాని కారణముగనే జీవుడు అహంకారము, బుద్ధి, మనస్సు, పంచేంద్రియములు పొంది వర్తించుచున్నాడు. ఎనిమిది ప్రకృతి తొడుగులతో దేహమందు మానవుడున్నాడు. ఇట్టి వాని కతీతముగ దైవమున్నాడు.

దైవమునుండి పుట్టిన మొదటి సంకల్పము నుండి ఎనిమిది (8) ప్రకృతులు పుట్టును. కనుక ప్రకృతికి కూడ తానే మూలము.

తననుండి పుట్టిన ప్రకృతినుండి తానేర్పరచిన రూపములు క్షర రూపములు. అనగా అది ప్రకృతికిలోనై యుండును. ప్రకృతికి పుట్టుట, పెరుగుట, పూర్ణముగ వృద్ధి చెందుట, తరుగుట, మర ణించుట అను ఐదు లక్షణము లున్నవి. కనుక క్షర రూపమునకు గూడ ఈ ఐదు లక్షణములు గలవు. కాని అందు ప్రవేశించిన జీవుడు దైవాంశ అగుటచే అతనికి ఈ పంచ అవస్థలు లేవు. అతని శరీరమునకు మాత్రము తప్పకయుండును. మార్పు చెందు రూపమున అనుభూతికై మార్పు చెందని జీవుడు ప్రవేశించు చున్నాడు. ఈ యథార్థ స్థితి మరచినచో ఈ అవస్థలు అనుభ వించును. పుట్టితినని, పెరిగితినని, పూర్ణముగ పెరిగితినని, తరుగు చున్నానని, వార్ధక్యము వచ్చుచున్నదని, మరణింతునని భ్రమించి భయపడుచుండును. ఇట్టి భయమునకు కారణము తన నిజస్థితి తనకు మరపు వచ్చుటయే. క్షర పురుషుడు ప్రకృతికి లొంగినవాడు గనుక, దైవము ప్రకృతికి కూడ అతీతుడు గనుక, తాను క్షర పురుషున కతీతుడనని దైవము పలికినాడు.

అట్లే అక్షర పురుషుని కన్న ఉత్తముడనని పలికినాడు. నిస్సందేహముగ ఇది సత్యము. జీవాంశయగు అక్షర పురుషుడు తనవలెనే శాశ్వతుడు, అవ్యయుడు. కాని అతడు మూడులోకము లను ప్రవేశించలేడు. అతని ప్రజ్ఞ, పాటవములు మెచ్చదగినవేగాని, ఎప్పటికిని తనతో సమానము కానేరవు. ఎంత తెలిసిన వాడైనను మూడు లోకములు ఏకకాలమున తెలిసి యుండలేడు. అతని ప్రజ్ఞ పరిమితము. అతని శక్తియు అపరిమితము కాదు. పరమాత్మ

అపరిమితుడు. అతని సంకల్పశక్తి, జ్ఞానము, క్రియాశక్తి కూడ అపరిమితము. కొలతల కందదు. తర్కమునకు అందదు. అతని అంశయైన జీవుడు ఎంత పెరిగినను అతనితో సమానుడు కాలేడు. అంశ మొత్తముతో ఎన్నటికిని సమానము కాదు. కనుక అక్షర పురుషుని కన్న తానే ఉత్తముడనని దైవము పలికినాడు.

జీవుడు తొమ్మిది (9) అంకెలవరకు పెరగ వచ్చును. కాని పూర్ణము కాలేడు. పూర్ణమెప్పుడును పూర్ణమే. అందుండి ఏమి తీసినను, అందుతో ఏమి కలిపినను పూర్ణము, పూర్ణముగనే యుండును. పూర్ణమునుండి ఏర్పడిన వన్నియు పూర్ణములోనికే వ్యయమగును. అట్టి పరిపూర్ణ తత్త్వము పరమాత్మ తత్త్వము. వశిష్ఠ అగస్త్యాది బ్రహ్మర్షులు పూర్ణులై యున్నను భగవానుడు కాజాలరు. అతడొక్కడే "స ఏకం". మరియొక దైవముండడు. అట్టి పూర్ణుడు పురుషోత్తముడు లేక పరమాత్మ. అతడు స్త్రీయు కాదు, పురుషుడూ కాదు. అందువలన అతని పేర్లు 1. నేను. 2. తత్. 3. సత్. 4. అ. 5. పూర్ణము.

ఇట్లు క్షరమగు ప్రకృతి యందు తగులుకొనిన పురుషుడు దైవీ తత్త్వమునకు తగులుకొని, అక్షరుడై పురుషోత్తమునితో సంగమించుట ఈ అధ్యాయమున సూచింపబడినది. గుర్తుపెట్టు కొనవలసిన విషయ మేమనగా, ప్రకృతినైనను, దేవునియైనను తగులుకొనువాడు జీవుడే. ప్రకృతి, దైవము తటస్థులు. జీవుడు దేనిని తగులుకొనిన దాని లక్షణము లేర్పడును.

## (18)

# పురుషోత్తమప్రాప్తి

**యో మా మేవ మసమ్మూఢో జానాతి పురుషోత్తమమ్ ।**
**స సర్వవి ద్భజతి మాం సర్వభావేన భారత ॥ 19**

తాత్పర్యము : ఈ విధముగ అజ్ఞానము లేనివాడు నన్ను పురుషోత్తమునిగ తెలియుచున్నాడు. అతడు సర్వభావముల యందు నన్నెరిగి నాతో కూడుచున్నాడు.

వివరణము : క్షర పురుషుని, అక్షర పురుషుని, పురుషోత్తముని ముందు తెలిపిన విధముగ తెలిసినవాడు అజ్ఞానము లేనివాడగు చున్నాడు. జ్ఞాన మజ్ఞానముచే కప్పబడి యున్నదని భగవద్గీత యందలి ముందు శ్లోకములలో తెలుపబడినది. అజ్ఞానము తొలగినచో యిక మిగులునది జ్ఞానమే. అజ్ఞానము తొలగించు కొనుటయే సాధన. జీవుడు సహజముగ జ్ఞానియే. అజ్ఞానము మబ్బువలె ఆవరించును. మబ్బు తొలగుటవలననే సూర్య దర్శన మగును. అట్లే అజ్ఞానము తొలగగనే ఆత్మజ్ఞానము కలుగును.

అజ్ఞానము లేనపుడు గోచరించునది పురుషోత్తముడు. పురుషోత్తముడే క్షరాక్షరముగ నున్నాడని తెలిసి యుండును.

ప్రకృతి, జీవులు పురుషోత్తముని నుండి దిగివచ్చినవారే అనియు, పురుషుడు దైవాంశ యనియు, పురుష దేహములు ప్రకృతి యనియు తెలిసి సమస్తమునకు మూలముగనున్న పురుషోత్తముని గుర్తించుటవలన పురుషోత్తమ ప్రాప్తి జరుగును. అన్నిటి యందు దానినే దర్శించుట వలన దానిలో జతకూడుట జరుగును. అట్లు జతకూడు విధానమే భజతి లేక భజన మార్గము అని తెలియ వలెను.

"సర్వ విద్భవతి" అంతయు నేనే అని తెలిసి కూడి యుండుట. "సర్వభావేన" అనగా అన్ని భావముల యందు దైవమునే దర్శించుట వలన మిగులునది దైవమే. దైవముకాని దేదియు గోచరింపదు. ఇట్టి వానికి పురుషోత్తముడు అన్నిచోట్ల దర్శన మిచ్చుచునే యుండును. అన్ని కాలముల యందు దర్శన మిచ్చు చునే యుండును. అన్ని రూపముల యందు దర్శన మిచ్చుచునే యుండును. వానిదే పురుషోత్తమప్రాప్తి. నారదుడు, ప్రహ్లాదుడు, అంబరీషుడు, పరీక్షిత్తు అట్టివారు. వీరిని భాగవతులు అందురు. ఇట్టి వారి రూపమున భగవంతుడుండును. భగవత్ప్రాప్తి కలిగి, భగవంతుని యందే చరించువారు భాగవతులు. ఇది సాధనకు పరాకాష్ఠ. వీరిని యోగీశ్వరులని, పరమ భక్తులని, అవధూత లని పిలుతురు.

## (19)

# కృతకృత్యుడు

**ఇతి గుహ్యతమం శాస్త్ర మిద ముక్తం మయాఽనఘ ।**
**ఏతద్బుద్ధ్వా బుద్ధిమాన్ స్యాత్కృతకృత్యశ్చ భారత ॥ 20**

*తాత్పర్యము :* రహస్యమగు ఈ శాస్త్రమును పాప రహితుడ వగు నీకు తెలియచేయు చున్నాను. దీని నెరిగినవాడు బుద్ధి మంతుడు. అతడు కృతకృత్యుడు కాగలడు.

*వివరణము :* పై తెలిపిన ఉపాయము పురుషోత్తమ ప్రాప్తి నిచ్చును. ఇది అత్యంత రహస్యమైనది. గుహ్యమనగా రహస్యము. గుహ్యతమము అనగా వివరించిననూ మరుగునబడి మరల రహస్యముగా నుండును. ఎన్నిమార్లు చెప్పినను మరుగున పడు చుండును. భగవానుడు తొమ్మిదవ అధ్యాయమున కూడ ఇట్లే పలికినాడు. సామాన్యముగ రహస్యములు మరుగున యుండును. తెలిపినపుడు తేటతెల్లమగును. కాని మరల మరుగున పడుట విశేషము. కనుక గుహ్యతమము.

తెలిపిన విషయము మరచుట అజ్ఞాన చిహ్నము. ఎంత

మరపున్నచో అంత అజ్ఞానముండును. ఎరుకకు మరపు విరుగుడు. మరపు మృత్యువు వంటిదని పెద్దలు తెలిపిరి. ఎరుక కలిగించి ననూ మరచువారు ఎరుక నిలుపుకొనుటకై ప్రయత్నింప వలెను.

మరపుకు కారణమేమి? ప్రజ్ఞ పదార్థమున చిక్కుకొనినపుడు మరపు కలుగును. ప్రాపంచిక విషయములందు ఆసక్తి మెండై నపుడు మరపు హెచ్చును. ప్రజ్ఞాపరమగు విషయములందు ఆసక్తి, అనురక్తి పెరుగుచున్నకొలది మరపు తగ్గును. అర్జునుడు అట్టి జిజ్ఞాసి. అతడు అనఘుడు. అనగా పాపము లేనివాడు. అంతేకాదు, అనసూయాపరుడు. అనగా ఇతరులను గూర్చి ఈర్ష్య పడనివాడు. అట్టి వానికి చేసిన ఉపదేశము ఫలించుట కవకాశ మున్నది. శ్రద్ధ లేనివానికి, పాపాత్మునికి, అసూయాపరునికి ఎంత జ్ఞానము నూరిపోసినను, సహజముగ వానియందు గల మరపు వలన సాధన ఆగును.

ఈ అధ్యాయమున తెలుపబడిన ఉపాయము రహస్య మగుటకు కారణ మొకటియే- సాధకుల అపాత్రత. వారియందు పవిత్రత, అనసూయత్వము ఏర్పడియున్నచో పురుషోత్తమ ప్రాప్తి సిద్ధించు అర్హత లభించును. అర్జునుడు కృష్ణునిచే లెస్సగా మెచ్చ బడినాడు. భగవద్గీత యందు శ్రీకృష్ణుడు అర్జునుని అనఘా అనియు అనసూయు డనియు, పురుష వృషభుడనియు, భరత శ్రేష్ఠుడనియు, ధనంజయుడనియు ప్రశంసించినాడు. అర్జునుని

వలె సద్గుణోపాసన చేయుచు, భగవద్గీత ననుసరించినచో ప్రతి మానవుడు కృతకృత్యుడు కాగలడు. కృతకృత్యుడనగా వచ్చిన పని ముగించుకొని విజయుడై గమ్యమునకు సాగువాడు.

ఈ అధ్యాయమునందు కృతకృత్యుడవు కమ్మని చిట్టచివరగా భగవానుడు ఆశీర్వదించినాడు.

*"కృతకృత్యశ్చ్యాత్ భారత"*

(కృతకృత్యుడవు కమ్ము భారత.)

*శ్రీమద్భగవద్గీత యందలి 15వ అధ్యాయము*
*'పురుషోత్తమ ప్రాప్తి యోగము' వివరణము*
*సంపూర్ణము.*

# ధనిష్ఠ తెలుగు ప్రచురణలు

## మాస్టర్ పార్వతీకుమార్‌గారి రచనలు

| | | |
|---|---|---|
| 1. | అమనస్కుడు | 30-00 |
| 2. | అసంగుడు | 25-00 |
| 3. | అన్వేషకుడు | 100-00 |
| 4. | అంబరీషుడు | 80-00 |
| 5. | అశ్వినీ దేవతలు | 100-00 |
| 6. | అంతర్దర్శన ధ్యానములు | 100-00 |
| 7. | ఆత్మసాధనా సూత్రములు | 50-00 |
| 8. | భారతీయ సంప్రదాయము | 20-00 |
| 9 | భాగవతమూర్తి భీష్ముడు | 100-00 |
| 10. | గోవు | 20-00 |
| 11. | గురుశిష్య సంవాదము | 60-00 |
| 12. | మాస్టరు యోగము - సాధనా సూత్రములు | 80-00 |
| 13. | మాస్టర్ సి.వి.వి. జన్మదిన సందేశము | 30-00 |
| 14. | మాస్టర్ సి.వి.వి. నూతన యోగము | 40-00 |
| 15. | మాస్టర్ సి.వి.వి. యోగము | 40-00 |
| 16. | మాస్టర్ సి.వి.వి. యోగము - కర్మరాహిత్యము | 20-00 |
| 17. | మాస్టర్ సి.వి.వి. - వరుణగ్రహ ప్రభావము | 22-00 |
| 18. | మన మాస్టరుగారు | 80-00 |
| 19. | గాయత్రీ మంత్ర అవగాహన | 10-00 |
| 20. | షోడశోపచార పూజ - అవగాహన | 10-00 |
| 21. | ప్రాణాయామము | 20-00 |
| 22. | ఓం | 100-00 |
| 23. | జ్యోతిష విజ్ఞానము | 100-00 |
| 24. | జ్యోతిర్లింగ యాత్ర | 20-00 |
| 25. | కథాదీపిక | 40-00 |

| | | |
|---|---|---|
| 26. | ధనకాముని కథ | 25-00 |
| 27. | సంఘనీతి | 120-00 |
| 28. | శ్వేత పద్మము | 30-00 |
| 29. | గీతోపనిషత్-సాంఖ్య యోగము | 25-00 |
| 30. | గీతోపనిషత్-కర్మ యోగము | 20-00 |
| 31. | గీతోపనిషత్-జ్ఞాన యోగము | 25-00 |
| 32. | గీతోపనిషత్-కర్మసన్యాస యోగము | 20-00 |
| 33. | గీతోపనిషత్-ధ్యాన యోగము | 40-00 |
| 34. | గీతోపనిషత్-విజ్ఞాన యోగము | 50-00 |
| 35. | గీతోపనిషత్-అక్షరపరబ్రహ్మ యోగము | 50-00 |
| 36. | గీతోపనిషత్-రాజవిద్య రాజగుహ్య యోగము | 80-00 |
| 37. | గీతోపనిషత్-విభూతి యోగము | 80-00 |
| 38. | ధర్మ విగ్రహుడు - శ్రీరాముడు | 35-00 |
| 39. | శ్రీమద్రామాయణ ధర్మకుసుమాలు-1 | 100-00 |
| 40. | శ్రీమద్రామాయణ ధర్మకుసుమాలు-2 | 100-00 |
| 41. | శ్రీ దత్తాత్రేయ | 40-00 |
| 42. | సాయి సూక్తులు | 80-00 |
| 43. | శ్రీలలిత (10 భాగములు) | 750-00 |
| 44. | శ్రీ శాస్త్రిగారు | 40-00 |
| 46. | మరణ రహస్యం (మార్కండేయుడు) -1 | 80-00 |
| 47. | మరణ రహస్యం (సతీ సావిత్రి దేవి)-2 | 100-00 |
| 48. | మరణ రహస్యం (నచికేత విద్య) -3 | 100-00 |
| 49. | యమగీత | |
| 50. | కుమార సంభవం | 70-00 |
| 51. | రుక్మిణీ కళ్యాణము | 100-00 |

ప్రతులకు : **ధనిష్ఠ ఫౌండేషన్,**

**15-7-1, ఏంజిల్స్ ఎన్‌క్లేవ్, కృష్ణనగర్, విశాఖపట్నం-530 002.**


Phone : 0891-2701531. www.dhanishta.org info@dhanishta.org


# ధనిష్ఠ ప్రచురణలు

















**ప్రతులకు :** ధనిష్ఠా ఫౌండేషన్, 15-7-1, ఏంజిల్స్ ఎన్‌క్లేవ్, కృష్ణనగర్, విశాఖపట్నం - 530 002.
Phone : 0891-2701531 www.dhanishta.org info@dhanishta.org

"ఈశ్వరుని చేరుటయే పురుషోత్తమ ప్రాప్తి. ఇతడెప్పడును యుండును. వ్యయము కాదు. పెరుగుట, తరుగుట యితనికి లేదు. ఇతనియందే మూడు లోకములు పుట్టి, పెరిగి, లయము చెందు చున్నవి. అన్ని లోకములు ఇతని యందే యున్నవి. ఇతడన్నిలోకములు నిండియున్నాడు. అంతేకాక భరించి యున్నాడు. ఇతనిని పరమాత్మ అని అందురు. ఇతడే విరాట్పురుషుడు కూడ. క్షర పురుషునకు, అక్షర పురుషునకు కూడ ఇతడే మూలము. కనుక ఉత్తమ పురుషుడు."

ISBN 978-81-89467-82-1

ధనిష్ఠ